# ప్రజాపక్షం
## జిల్లా అనుబంధం

కరీంనగర్ సిరిసిల్ల పెద్దపల్లి జగిత్యాల నిర్మల్
ఆదిలాబాద్ మంచిర్యాల నిజామాబాద్ కామారెడ్డి

గురువారం | 15 అక్టోబరు, 2026 | పేజీలు :08





జగిత్యాల అదనపు కలెక్టర్‌గా ప్రసూనాంబ బాధ్యతల స్వీకరణ




## కాంగ్రెస్ పరిపాలనలో
# కుంభకోణాల కుంభమేళా

బొగ్గు ఉత్పత్తి తగ్గించారు -కరెంటు లేకుండా చేశారు
కోల్ మాఫియా నుంచి సంస్థను కాపాడేది కెసిఆర్ ఒక్కరే
బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్

**ప్రజాపక్షం/గోదావరిఖని :** నూట ముప్పై ఏళ్ల చరిత్ర గల సింగరేణి సంస్థను, కార్మికుల కష్టాన్ని, త్యాగాన్ని రాష్ట్రంలోని దండుపాళ్యం ముఠా దోచుకుంటుందని బిఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ కాంగ్రెస్‌పై తీవ్రంగా ఆరోపించారు. బుధవారం పెద్దపల్లి జిల్లా గోదావరిఖని పట్టణంలో బిఆర్ఎస్, టిజిబికెఎస్ ఆధ్వర్యంలో జరిగిన సింగరేణి కార్మిక గర్జన భారీ బహిరంగసభలో బిఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రసిడెంట్ కెటీఆర్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. సింగరేణిలో బొగ్గు ఉత్పత్తి తగ్గడం వల్లనే రాష్ట్రంలో నేడు కరెంటు కోతలు ఏర్పాడ్డాయని చెబుతూ, యాదాద్రి, కెటిపిఎస్, ఇతర ప్లాంట్లలో విద్యుత్తు ఉత్పత్తి లేకుండా చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారన్నారు. 24 గంటలపాటు నిరంతర కరెంటు సరఫరా ఇచ్చిన ఘనత కెసీఆర్‌దేనన్నారు. కాంగ్రెస్ వచ్చింది..కరెంటు పోయింది.. అన్న మాట నిజమైందన్నారు. మోసపోతే గోస పడ్తరూ, ఆగం అయితరని ఆనాడు కెసిఆర్ చెప్పిన మాటలు ప్రజలు పెడచెవిన పెట్టడం వల్లనే నేడు ఈ దుస్థితి ఏర్పడిందన్నారు. సింగరేణికి రూ.60 వేల కోట్ల బకాయిలను ఎందుకు ఇవ్వడంలేదని రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. 40 లక్షల మెట్రిక్ టన్నుల బొగ్గు మాయమైందని నిలదీస్తే అబద్ధం మాటలతో తప్పించుకునే ప్రయత్నం చేశారన్నారు. 70 నుంచి 58 మిలియన్ టన్నులకు బొగ్గు ఉత్పత్తి పడిపోయిందని, దీనికి కాంగ్రెస్ పాలనే కారణమన్నారు. ఓపెన్ కాస్టు గనుల టెండర్లు ఖరారు కాకపోవడానికి నేతల వాటాల పంచాయితీనే కారణమని విమర్శించారు. సిఎం రేవంత్‌రెడ్డి బామ్మర్ది సృజన్‌రెడ్డికి చెందిన సోధా కన్‌స్ట్రక్షన్ కంపెనీ పేరు ప్రస్తావిస్తూ సైట్ విజిట్ సరిఫికెట్ల పేరిటా రూ.10 వేల కోట్ల కుంభకోణం జరిగిందని ఆరోపించారు. డీజిల్, తరువాయి 2లో...



# జిఒ 76 పెండింగ్ దరఖాస్తుల ధ్రువీకరణ 10 రోజుల్లోగా పూర్తి

కలెక్టర్ కోయ శ్రీ హర్ష

**ప్రజాపక్షం/పెద్దపల్లి :** జిఒ 76 కింద పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల ధ్రువీకరణ ప్రక్రియను 10 రోజుల్లోగా పూర్తి చేసి, అర్హులైన లబ్ధిదారులకు ఇంటి పట్టాలు అందేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష రెవెన్యూ అధికారులను ఆదేశించారు. బుధవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ బి.శ్రీరాములు, అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) అరుణ శ్రీతో కలిసి రెవెన్యూ శాఖ అధికారులతో జీవో 76 దరఖాస్తుల పరిష్కారంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జీవో 76కు సంబంధించి ప్రభుత్వం ఇటీవల జారీ చేసిన సర్క్యులర్ ప్రకారం రామగుండం మండల పరిధిలో పెండింగ్‌లో ఉన్న 1,583 దరఖాస్తులను రెవెన్యూ, మున్సిపల్, సింగరేణి అధికారులతో స్పెషల్ టీం ద్వారా త్వరితగతిన పరిశీలించి, అర్హులను ధ్రువీకరించాలని తెలిపారు. పెండింగ్ దరఖాస్తుల పరిశీలన, ధ్రువీకరణ ప్రక్రియను రాబోయే 10 రోజుల్లోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. దరఖాస్తులకు సంబంధించిన రికార్డులు, వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి, నిబంధనల ప్రకారం అర్హులైన లబ్ధిదారులను గుర్తించాలని సూచించారు. దరఖాస్తుల పరిశీలనలో ఎలాంటి జాప్యం జరగకుండా,నిర్ణీత గడువులోగా ధ్రువీకరణ ప్రక్రియను పూర్తి చేయాలని తెలిపారు. జీవో 76 కింద అందిన దరఖాస్తులను నిబంధనల ప్రకారం పరిశీలించి, అర్హులైన వారికి ఇంటి పట్టాలు అందించేలా సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. పెండింగ్ దరఖాస్తుల పరిష్కారంపై నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని, నిర్దేశించిన గడువులోగా ప్రక్రియను పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఆర్డీవో బి.గంగయ్య, సింగరేణి ఆర్జీ-2 అధికారులు, ఆర్జీ-2 జనరల్ మేనేజర్, ఈ సెక్షన్ సూపర్డెంట్ విజయ్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# పల్లెల్లో గుడుంబా విచ్చు!

మత్తు కోరల్లో యువత.. రోడ్డున పడుతున్న పేద బతుకులు

అధికారుల నిర్లక్ష్యంతో రెచ్చిపోతున్న సారా మాఫియా




# ఓటర్ల నమోదుకు ప్రత్యేక శిబిరాలు



నేడు, రేపు ప్రత్యేక శిబిరాలు
కలెక్టర్ గరిమ అగ్రవాల్

**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు ప్రతి పోలింగ్ కేంద్రంలో ఈనెల 15వ తేది గురువారం, 16వ తేది శుక్రవారం ప్రత్యేక శిబిరాలను నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ వెల్లడించారు. ప్రతి పోలింగ్ స్టేషన్ వద్ద ప్రత్యేక శిబిరాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ముసాయిదా ఓటర్ల జాబితాలో పేర్లు లేనివారు మొదటిసారి ఓటర్లుగా నమోదు చేసుకోవాలనుకునే యువత ఈ నిర్దేశిత తరువాయి 2లో

## ఓటర్ల నమోదుకు ప్రత్యేక శిబిరాలు

(మొదటిపేజీ తరువాయి)

కేంద్రాలను సందర్శించి ఓటర్ల జాబితాలో తమ పేర్లను నమోదు చేసుకోవడానికి ఫారం6 ద్వారా ధరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పైన పేర్కోన్న రోజుల్లో సంబంధిత బిఎల్‌వోలు, బిఎల్‌ఏలు ఆయా నిర్దేశిత కేంద్రాలలో అందుబాటులో ఉంటారని పేర్కోన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో ఈనెల 15, 16 తేదీలలో ప్రత్యేక శిబిరాలను నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ తెలిపారు.

## జగిత్యాల అదనపు కలెక్టర్‌గా ప్రసూనాంబ బాధ్యతల స్వీకరణ

**ప్రజాపక్షం/జగిత్యాల :** జగిత్యాల జిల్లా అదనపు కలెక్టర్‌గా ప్రసూనాంబ బుధవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీల్లో భాగంగా ఆమెను అదనపు కలెక్టర్‌గా నియమించారు. గతంలో ఆమె తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి కార్యాలయంలో డిప్యుటేషన్‌పై విధులు నిర్వహించారు. అక్కడి నుంచి బదిలీపై జగిత్యాల జిల్లా అదనపు కలెక్టర్‌గా నియమితులై నేడు బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా రెవెన్యూ అధికారి కే.వై. ప్రసాద్ కలెక్టరేట్ ఏవో కిషన్, కలెక్టరేట్ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

## రోడ్డు మధ్యలో విద్యుత్ స్తంభం

**ప్రజాపక్షం/గన్నేరువరం :** గన్నేరువరం మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద రోడ్డు మధ్యలో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభం వాహనదారులతోపాటు స్థానికులకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తోంది. ప్రధాన రహదారి మలుపు వద్దే ఈ స్తంభం ఉండడంతో నిత్యం రాకపోకలు సాగించే వాహనదారులు ప్రమాదాల బారిన పడే అవకాశం ఉంది. రాత్రివేళల్లో తగినంత వెలుతురు లేక ఈ స్తంభాన్ని గమనించలేకపోతే పెద్ద ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని స్థానికులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ మార్గంలో నిత్యం అనేక వాహనాలు, పాఠశాల బస్సులతోపాటు పాదచారులు రాకపోకలు సాగిస్తుంటారు. ఈ విషయమై విద్యుత్ శాఖ అధికారుల దృష్టికి పలుమార్లు తీసుకెళ్లినా అధికారులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదని స్థానికులు మండిపడుతున్నారు. ఏదైనా పెద్ద ప్రమాదం జరిగితే తప్ప అధికారులు స్పందించరా అని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి ప్రమాదకరంగా ఉన్న ఈ విద్యుత్ స్తంభాన్ని తొలగించాలని గన్నేరువరం గ్రామస్తులు వాహనదారులు విజ్ఞప్తి చేస్తున్నారు.



# కాంగ్రెస్ పరిపాలనలో కుంభకోణాల కుంభమేళా

(మొదటిపేజీ తరువాయి)

జిలిటెన్ స్టిక్స్, సోలార్, జైపూర్ పవర్ ప్లాంట్ కుంభకోణాలు జరిగాయని విమర్శించారు. ఆధారాలు, రుజువులతో బిజెపి కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి ఫిర్యాదు చేసినా ప్రయోజనం లేదన్నారు. బిజెపి, కాంగ్రెస్ దొందూ దొందేనన్నారు. దీనికితోడు సింగరేణి సంస్థ, కార్మికుల సొమ్ముతో ఫుట్‌బాల్ సరదాలు తీర్చుకుంటున్నారన్నారు. కార్మికులకు చెందాల్సిన లాభాలు నేతల జేబుల్లోకి వెళ్లాయన్నారు. కేవలం రెండేళ్ల కాలంలో రూ.6,317 కోట్లు దాచి పెట్టి దోచుకుంటున్నారని ఆరోపించారు. ఇంత అవినీతి జరుగుతుంటే 49 శాతం వాటా ఉన్న కేంద్ర ప్రభుత్వం ఎందుకు మౌనంగా ఉంటుందన్నారు. సిబిఐతో, సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలన్నారు. గులాబీ గర్జన గర్జిస్తేనే నేడు దసరా బోనస్ ప్రకటించారన్నారు. డిపెండెంట్లకు, కారుణ్య నియమాకాల మెడికల్ బోర్డు పెట్టి ఉద్యోగాలు ఇచ్చింది కెసిఆర్ అన్నారు. పోరాటాల పురిటిగడ్డ రామగుండం అని తెలంగాణ ఉద్యమంలో కెసిఆర్ వెంట సింగరేణి కార్మిక లోకం తరలివచ్చిందన్నారు. సకలజనుల సమ్మెకు సింగరేణి కార్మికులు అండగా నిలబడ్డారన్నారు. సింగరేణి బతకాలంటే కెసిఆర్ ఒక్కరే బ్రహ్మాస్త్రమని, మళ్లీ ఆయన సిఎం కావాలన్నారు. కాగా, గోదావరిఖని స్టేడియంలో జరిగిన వేలాది మంది కార్మికులతోపాటు ప్రజలు పాల్గొన్నారు. ఈ సభలో మాజీ మంత్రులు కొప్పుల ఈశ్వర్, జగదీశ్‌రెడ్డి, టి.జీవన్‌రెడ్డి, గంగుల కమలాకర్, బాల్క సుమన్, ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు కోరుకంటి చందర్, నడిపెల్లి దివాకర్‌రావు, సుంకె రవిశంకర్, నాయకులు కోలేటి దామోదర్, కౌశిక హరి, వ్యాళ్ల హరీష్‌రెడ్డి, మిర్యాల రాజిరెడ్డి, మూల విజయారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా మహా అన్నప్రసాద వితరణ

### అమ్మవారిని దర్శించుకున్న బిజెపి కార్పొరేటర్ కేపీపీ చంద్ర



**ప్రజాపక్షం/కరీంనగర్ :** దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా శ్రీ దేవి యువసేన ఆధ్వర్యంలో 19వ శరన్నవరాత్రి ఉత్సవాలు ఎంతో భక్తిశ్రద్ధలతో, వైభవంగా జరుగుతున్నాయి . నిత్య పూజా కార్యక్రమాలతో దేవి నవరాత్రి ఉత్సవాల నిర్వహణలతో ప్రాంగణమంతా భక్తిపారవశ్యంతో, కోలాహలంగా మారింది. ఉత్సవాల్లో భాగంగా బుధవారం ఎల్ ఎం డి కాలనీ, రామ్‌లీలా మైదాన్ ప్రాంగణంలో భక్తుల కోసం మహా అన్నప్రసాదం వితరణ కార్యక్రమాన్ని అత్యంత ఘనంగా ఏర్పాటు చేశారు. కరీంనగర్ బిజెపి కార్పొరేటర్ కే పీపీ చంద్ర శ్రీ దేవి అమ్మవారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్థానిక భక్తులతో కలసి మహా అన్నప్రసాద వితరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్పొరేటర్ ఏపీపీ చంద్ర మాట్లాడుతూ శ్రీదేవి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అన్న ప్రసాద వితరణ కార్యక్రమం శ్రీ దేవి యువసేన సభ్యులు ఎంతో నిష్ఠతో, భక్తితో ప్రజలకు అన్నప్రసాద వితరణ చేయడం అభినందనీయమన్నారు అమ్మవారి కృపాకటాక్షాలు ప్రజలందరిపై సదా ఉండాలని కోరుకుంటున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో శ్రీ దేవి యువసేన కుటుంబ సభ్యులు, నిర్వాహకులు కొత్తూరి శ్రీనివాస్, బట్టు కరుణాకర్, కడార్ల శ్రీనివాస్, ప్రదీప్, భవాని దీక్షపరులు భక్తులు పాల్గొన్నారు.

# మల్లారెడ్డి సేవలు చిరస్మరణీయం




### ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

**ప్రజాపక్షం/చొప్పదండి :** ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం వ్యవస్థాపకులు కీ.శే.కళ్లెం మల్లారెడ్డి 19వ వర్ధంతిని సంఘ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం హాజరై మల్లారెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మల్లారెడ్డి సంఘాన్ని స్థాపించి ప్రత్యక్షంగా 22 మంది ఉద్యోగులకు, జీవనోపాధి కల్పించారని పరోక్షంగా మండల పరిధిలోని తొమ్మిది గ్రామాల రైతులకు రుణాలు, తక్కువ ధరకే ఎరువులు, పురుగు మందులు అందేలా చేశారన్నారు. ఆయన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. సంఘ అధ్యక్షుడు ఇప్ప శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ మల్లారెడ్డి ఆశయాలకు అనుగుణంగా సంఘాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తామని అన్నారు. ఈ నెలాఖరులోగా సోలార్ ప్లాంట్ ద్వారా విద్యుత్ ఉత్పత్తి ప్రారంభిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాలకవర్గ సభ్యులు నిజాపురం చందు, మారు తిరుపతి రెడ్డి, కొట్టె చందు, పెద్దిరెడ్డి గణపతి రెడ్డి, పూదరి సత్యం, గంకి కిష్టారెడ్డి, కౌన్సిలర్లు గుర్రం రాజేందర్ రెడ్డి, పిట్టల వెంకటేశ్, గుర్రం సుజిత్ రెడ్డి, నాయకులు వడ్లూరి శ్రీనివాస్, ముదం తిరుపతి, పెరుమాండ్ల గంగయ్య, మాజీ అధ్యక్షులు గుంటి మల్లయ్య, కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి, సంఘం కార్యదర్శి కళ్లెం తిరుపతి రెడ్డి, మల్లారెడ్డి కుమారులు ప్రభాకర్ రెడ్డి, సుభాష్ రెడ్డి, మునీందర్ రెడ్డి, సంజీవ్ రెడ్డి, కుటుంబ సభ్యులు, సంఘ సిబ్బంది పాల్గొన్నారు.

# శ్రీ దుర్గా భవానీ దేవి ఆలయానికి పోటెత్తిన భక్తజనం

### వైష్ణవీ రూపంలో దర్శనమిచ్చిన అమ్మవారు

**ప్రజాపక్షం/కొత్తపల్లి :** కరీంనగర్ రూరల్ మండలంలోని నగునూర్ గ్రామంలో వెలసిన శ్రీ దుర్గా భవానీ దేవి ఆలయంలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా శ్రీ దుర్గా భవానీ దేవి ఆలయానికి భక్తులు భారీ సంఖ్యలో పోటేత్తారు. ఆలయ ప్రాంగణమంతా జై భవానీ జై జై భవానీ నామస్మరణతో మారుమోగింది. గరుడ వాహనంపై అమ్మవారు పసుపు రంగు పట్టు చీరను ధరించి విశేషంగా వైష్ణవీ దేవి అలంకరణలో భక్తులకు అమ్మవారు దివ్య దర్శనమిచ్చారు. గరుడ వాహనంపై శోభాయమానంగా కొలువుదీరిన జగన్మాతను దర్శించుకుని భక్తులు పులకించిపోయారు. ఆలయంలో ప్రత్యేక పూజలు, హోమాలు, కుంకుమార్చనలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో భాగంగా కరీంనగర్ జిల్లా న్యాయమూర్తి దుర్గా భవానీ దేవిని దర్శించుకున్నారు. ఆలయ మర్యాదలతో వారికి ఘన స్వాగతం పలికిన నిర్వాహకులు ప్రత్యేక దర్శన సదుపాయం కల్పించారు. పూజల అనంతరం వేద పండితులు న్యాయమూర్తికి వేదాశీర్వచనంతో పాటు అమ్మవారి తీర్థ ప్రసాదాలు అందజేశారు.



## నేడు, రేపు ఓటరు జాబితా ప్రత్యేక నమోదు

### కలెక్టర్ చిత్రా మిశ్రా

**ప్రజాపక్షం/కరీంనగర్ :** భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఈ నెల 15, 16 తేదీల్లో ఓటరు జాబితాల ప్రత్యేక నమోదు కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఓటరు జాబితాలో పేర్లు లేని అర్హులైన పౌరులు కొత్తగా ఓటరుగా నమోదు చేసుకోవాలని, జాబితాలో వివరాలు తప్పుగా ఉన్నవారు సవరణలు చేయించుకోవాలని సూచించారు. 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జిల్లాలోని ప్రతి పోలింగ్ కేంద్రంలో సంబంధిత బూత్ స్థాయి అధికారులు ఈ రెండు రోజులు అందుబాటులో ఉంటారని తెలిపారు. బిఎల్‌వోలు, బిఎల్‌ఏల సమక్షంలో ముసాయిదా ఓటరు జాబితాను పరిశీలించి, అవసరమైన సవరణలను గుర్తించి ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ఎంతో కీలకమని, అర్హులైన ప్రతి పౌరుడు ఓటరుగా నమోదు చేసుకుని ఎన్నికల ప్రక్రియలో భాగస్వామి కావాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా కోరారు. అర్హులైన వారెవరూ ఓటు హక్కుకు దూరం కాకుండా ప్రతి ఒక్కరూ తమ ఓటరు వివరాలను పరిశీలించుకోవాలని సూచించారు.

## కేంద్రాల్లోనే ధాన్యాన్ని విక్రయించాలి

**ప్రజాపక్షం/శంకరపట్నం :** ప్రాథమిక సహకార సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యాన్ని విక్రయించాలని మెట్టుపల్లి ప్రాథమిక సహకార సంఘం చైర్మెన్ గాజుల మహేష్ రైతులకు సూచించారు. బుధవారం సొసైటీ పరిధిలోని ఆముదాలపల్లి,మెట్టుపల్లి, మొలంగూర్ తదితర గ్రామాల్లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ధాన్యన్ని కొనుగోలు కేంద్రాలకు తరలించి ఆరబెట్టి కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించి ప్రభుత్వం అందించే మద్దతు ధరలను పొందలని రైతులకు సూచించారు. రైతులు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కొనుగోలు కేంద్రాల్లో అన్ని వసతులు కల్పించామని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రైతులు తదితరులు పాల్గోన్నారు.

## ఓద్యారం పాఠశాలకు బండి సంజయ్ అభినందనలు

**ప్రజాపక్షం/గంగాధర :** ఎస్‌హెచ్‌విఆర్ 2025–26లో జాతీయ స్థాయి గుర్తింపు పొందిన గంగాధర మండలం ఓద్యారం జడ్పిహెచ్‌ఎస్ పాఠశాలకు కేంద్ర మంత్రి కరీంనగర్ ఎంపి బండి సంజయ్ కుమార్ అభినందనలు తెలిపారు. స్వచ్ఛత, పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణ, సుస్థిర అభివృద్ధిలో విశిష్ట కృషి చేసిన ఈ పాఠశాల దేశవ్యాప్తంగా 190 పాఠశాలల్లో 23వ ర్యాంకు సాధించింది. తెలంగాణ నుంచి జాతీయ స్థాయికి ఎంపికైన 10 పాఠశాలల్లో ఒకటిగా నిలిచింది. పాఠశాల ఇంఛార్జి హెచ్‌ఎం ఈ.శ్రీనివాస్, మాజీ హెచ్‌ఎం, మాజీ ఎంఈఓ ఎనుగు ప్రభాకర్ రావును బండి సంజయ్ ప్రత్యేకంగా అభినందించారు. తన పార్లమెంట్ పరిధిలోని ప్రభుత్వ పాఠశాల జాతీయస్థాయిలో గుర్తింపు పొందడం గర్వకారణంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో టీపీయూఎస్ అధ్యక్షుడు ఎ.తిరుపతి రావు, కనకోటి హరిచరణ్, బుర్ర నాగరాజ్, ద్యావనపల్లి శ్రీకాంత్ రావు, 50వ వార్డు కార్పోరేటర్ బోయినపల్లి ప్రవీణ్ రావు పాల్గొన్నారు. త్వరలో ఢిల్లిలో జరిగే జాతీయ సత్కారంలో పాఠశాలకు ప్రశంసా పత్రంతోపాటు రూ.1 లక్ష నగదు ప్రోత్సాహకం అందజేయనున్నారు. ఢిల్లీ వచ్చేటప్పుడు తన నివాసానికి రావాలని పాఠశాల ప్రతినిధులకు బండి సంజయ్ కుమార్ సూచించారు. గతంలో 2016–17 సంవత్సరంలోనూ ఈ పాఠశాల రాష్ట్రస్థాయి గుర్తింపు పొందింది.



# ఎమ్మెల్యే సహకారంతో ఓబులాపూర్ అభివృద్ధి



**ప్రజాపక్షం/మల్లాపూర్:** స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ సహకారంతో ఓబులాపూర్ గ్రామం అభివృద్ధిలో ముందుకు సాగుతుందని గ్రామ సర్పంచ్ తోటా మాధురి రాజారెడ్డి అన్నారు.ఈ మేరకు బుధవారం గ్రామంలోని మూడో వార్డులో ఎమ్మెల్యే సంజయ్ కృషితో మంజూరైన ఐదు లక్షల రూపాయలు నిధులతో సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేసి పూర్తి చేశారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ తోట మాధురి రాజారెడ్డి, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్,గ్రామస్తులు ఉన్నారు.

# పారిశుద్ధ్య కార్మికులకు నూతన వస్త్రాల పంపిణీ



**ప్రజాపక్షం/మెట్‌పల్లి:** విజయదశమి పండుగను పురస్కరించుకొని మెట్‌పల్లి పట్టణంలోని 14వ వార్డు కౌన్సిలర్ ధోనికెల శిరీ టష–నవీన్ దంపతులు తమ వార్డులో పనిచేసే మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులకు నూతన వస్త్రాలను అందించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణాన్ని నిరంతరం పరిశుభ్రంగా ఉంచడంలో పారిశుద్ధ్య కార్మికుల కృషి ఎంతో గొప్పదని, వారిని గౌరవించుకోవడం అందరి బాధ్యత అని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కార్మికులు గంగారం,లక్ష్మి ,నిజాముద్దీన్,రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా అమ్మవారికి బోనాల సమర్పణ



**ప్రజాపక్షం/మల్లాపూర్:** మండల కేంద్రంలో పాత బస్టాండ్ భరతమాత కూడలి వద్ద నవదుర్గ సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన అమ్మవారి మండపంలో నవరాత్రి ఉత్సవాలు అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయి. ఈ మేరకు బుధవారం స్థానిక హనుమాన్ ఆలయం నుండి పాత బస్టాండులోని అమ్మవారి మండపం వరకు మహిళలు డప్పు చప్పులు మంగళ హారతులు,పోతరాజుల విన్యాసాల మధ్య నెత్తిన బోనమెత్తుకొని ఊరేగింపు నిర్వహించి అమ్మవారికి ఘనంగా సమర్పించి మొక్కులను చెల్లించుకున్నారు.ఈ కార్యక్రమంలో మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ చిట్యాల లక్ష్మణ్, గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ క్యాతం సురేష్ రెడ్డి, మాజీ చైర్మన్ సంఘ రాజన్న,విగ్రహ దాత మొరపు జలపతి,పంచలోహ విగ్రహదాత తోట రాజారాం, నవదుర్గ సేవ సమితి సభ్యులు మోరసతీష్,చంద్రశేఖర్,శంకర్,ప్రజా ప్రతినిధులు,మహిళలు,దీక్షాపరులు సభ్యులు పాల్గొన్నారు.

# విద్యుత్ సరఫరా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ స్పేర్ పార్ట్స్ చోరీ..!

## కల్లెడలో ఘటన.. పోలీసుల నిఘాపై గ్రామస్తులు, రైతుల అనుమానాలు



**ప్రజాపక్షం/జగిత్యాలరూరల్:** జగిత్యాల రూరల్ మండల ం కల్లెడ గ్రామ పరిధిలోని రిజర్వ్ ఫారెస్ట్ సమీపంలో వి ద్యుత్ సరఫరా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ స్పేర్ పార్ట్స్ చోరీకి గురికావడం స్థానికంగా కలకలం రేపింది. విద్యుత్ సరఫరా కొనసాగుతున్న ట్రాన్స్‌ఫార్మర్ లోని స్పేర్ పార్ట్స్ దొంగలు ఎత్తుకెళ్లడం విద్యుత్ శాఖ అధికారులతో పాటు గ్రామ ప్రజలు, రైతులను సైతం ఆశ్చర్యానికి గురిచేసింది. విద్యుత్ సరఫరా ఉన్నప్పటికీ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఎలా తొలగించా రు..? ఈ ఘటనకు పాల్పడిన వారు ఎవరు..? అనే ప్రశ్న లు స్థానికంగా చర్చనీయాంశంగా మారాయి. విద్యుత్ సరఫరా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ స్పేర్ పార్ట్స్ చోరీ ఎలా..? సాధారణంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను తొలగించాలంటే వి ద్యుత్ కనెక్షన్, పరికరాలను నిర్వహించే విషయంలో సా ంకేతిక పరిజ్ఞానం అవసరం. అలాంటిది విద్యుత్ సరఫరా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ స్పేర్ పార్ట్స్ చోరీకి గురైందనే విషయం స్థానికులను విస్మయానికి గురిచేస్తోంది.

# విద్యుత్ సమస్యలపై రైతుల ధర్నా

## మోటార్లు, విద్యుత్ పరికరాలు కాలిపోతున్నాయని ఆవేదన.. డిఇకి వినతి



**ప్రజాపక్షం/ఇబ్రహీంపట్నం:** జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలం కోమటి కొండాపూర్ గ్రామ రైతులు, గ్రామస్తులు విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బుధవారం వర్షకొండ సమీపంలోని సబ్‌స్టేషన్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ కొప్పెల పద్మజ వెంకన్న,రైతులు మాట్లాడుతూ రెండు ఫీడర్లు ఉండగా ఒకే ఫీడర్ ద్వారా విద్యుత్ సరఫరా కావడంతో మోటార్లు,ఇతర విద్యుత్ పరికరాలు కాలిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.ఎర్ధండి నుంచి వచ్చే పాత విద్యుత్ లైన్ కింద చెట్ల కొమ్మలను తొలగించి పునః రుద్ధరించాలని, రెండు ఫీడర్ల ద్వారా విద్యుత్ సరఫరా చేయాలని కోరారు. ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు త్రీఫేజ్ విద్యుత్ అందించాలని మెట్పల్లి విద్యుత్ డీఈకి సమర్పించిన వినతిపత్రంలో పేర్కొన్నారు.అనంతరం సర్పంచ్, ఉపసర్పంచ్ ఆధ్వర్యంలో రైతులు,గ్రామస్తులు విద్యుత్ ఏఈ ప్రశాంత్‌కు వినతిపత్రం అందజేశారు.ఈ కార్యక్రమంలో పలువురు రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఎడ్యుకేషన్ కాంక్లేవ్ అండ్ టీచర్స్ అవార్డ్స్ 2026



**ప్రజాపక్షం/గొల్లపల్లి :** అన్ని దానాల్లో కన్నా విద్యా దానాన్ని మించింది లేదు .జీవితాన్ని మార్చే విద్యా దానం కంటే మించిన దానం లేదనేది పెద్దలు చెప్పే మాట.కళ్ళు తెరిపించి గెలుపు బాట చూపించే గురువులను మించిన దైవం ఎక్కడా లేదు .అని మహోన్నత ఆశయంతో తరగతి గది నాలుగు గోడల మధ్య దేశ భవిష్యత్తును తీర్చి దిద్దుతున్న అక్షర యోధులను సత్కరిస్తూ జీ తెలుగు న్యూస్ ఆధ్వర్యంలో అక్టోబర్ 13న నిర్వహించిన ఎడ్యుకేషన్ కాంక్లేవ్ అండ్ టీచర్స్ అవార్డ్స్ 2026 గురు వందనంకార్యక్రమంలో జగిత్యాల జిల్లా ,గొల్లపల్లి మండల కేంద్రానికి చెందిన మోటివేషనల్ స్పీకర్ తాడూరి శ్రీనివాస్ ఆచార్య లీడ్ ఇండియా ఫౌండేషన్ లో రెండు దశాబ్దాలకు పైగా సేవలు అందిస్తూ తెలుగు రాష్ట్రాల్లోని లక్షలాదిమంది విద్యార్థులకు వ్యక్తిత్వ వికాస శిక్షణనందించినందుకు గాను ఉత్తమ ఆర్గనైజర్ మరియు ఉత్తమ వ్యక్తిత్వ వికాస నిపుణుడిగా పురస్కారం అందుకున్నారు.లీడ్ ఇండియా ఫౌండేషన్ లో రెండు దశాబ్దాలకు పైగా సేవలు అందిస్తూ,లక్షలాది మంది విద్యార్థులకు స్ఫూర్తినిచ్చిన ఆయన కృషిని గుర్తించి జీ తెలుగు న్యూస్ ఎడిటర్ ఇన్ చీఫ్ భారత్ చేతుల మీదుగా ఈ పురస్కారాన్ని ప్రధానం చేశారు . ఈ సందర్భంగా తాడూరు శ్రీనివాస్ ఆచార్య మాట్లాడుతూ ఈ అవార్డు 2005 నుంచి 2026 వరకు లీడ్ ఇండియా ఫౌండేషన్ లో ఉత్తమ సేవలు అందించినందుకు గాను, ఆలాగే ఒకే సంస్థలో 21 సంవత్సరాలు చాలా చైతన్యవంతంగా మంచి మోటివేషనల్ స్పీకర్ గా ఉంటూ రెండు తెలుగు రాష్ట్రాలలో పది లక్షల మంది విద్యార్థి విద్యార్థులకు మీ అభివృద్ధి దేశ అభివృద్ధి అనే చక్కటి కార్యక్రమాన్ని అందించినందుకు ఈ అవార్డ్ అందుకోవడం జరిగిందని అన్నారు .లీడ్ ఇండియా ఫౌండేషన్ ఫౌండర్ అండ్ చైర్మన్ డాక్టర్ ఎన్.బి సుదర్శన ఆచార్య ఆధ్వర్యంలో దేశమంతా కూడా ఇలాంటి శిక్షణ కార్యక్రమాలు పాఠశాల ,కాలేజ్ ఉపాధ్యాయుల వరకు తీసుకెళ్లడం జరుగుతుందని అన్నారు. వ్యక్తి అభివృద్ధి దేశాభివృద్ధి అనే నినాదంతో శిక్షణ కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు .

# శాంతి భద్రతల పరిరక్షణే లక్ష్యం




**ప్రజాపక్షం/కోరుట్ల :** కోరుట్ల పోలీస్ స్టేషన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ (సీఐ)గా కొమ్ము తిరుపతి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల జరిగిన పోలీస్ శాఖ బదిలీల్లో భాగంగా ఆయనను కోరుట్లకు బదిలీ చేయగా,తాజాగా బాధ్యతలు చేపట్టారు.ఈ సందర్భంగా కొమ్ము తిరుపతి మాట్లాడుతూ పోలీస్ స్టేషన్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ, ప్రజలకు మెరుగైన పోలీస్ సేవలు అందించేందుకు చర్యలు చేపట్టనున్నారు.ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, వారి సమస్యలను సత్వరమే పరిష్కరించే దిశగా,ప్రజలు తమ సమస్యలు, ఫిర్యాదులను నిర్భయంగా పోలీసుల దృష్టికి తీసుకురావాలని, శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులకు సహకరించాలని కోరుతున్నారు. ప్రజల భద్రత,శాంతిభద్రతల పరిరక్షణ,నేరాల నియంత్రణకు పోలీస్ శాఖ నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు.

# ఆంజనేయస్వామి దర్శించుకున్న జగిత్యాల అదనపు కలెక్టర్



**ప్రజాపక్షం/మల్యాల:** ఇటీవల జగిత్యాల జిల్లా అదనపు కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన ప్రసూనాంభ బుధవారం కుటుంబసమేతంగా కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామివారిని దర్శించుకున్నారు.ఈ సందర్భంగా ఆలయ అధికారులు ఆమెకు ఆలయ సంప్రదాయం ప్రకారం స్వాగతం పలికారు. అనంతరం ఆలయ అర్చకులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, అదనపు కలెక్టర్‌కు తీర్థ ప్రసాదాలు అందజేశారు.ఈ కార్యక్రమంలో మల్యాల తహశీల్దార్ శ్రీనివాస్,కొడిమ్యాల తహశీల్దార్ నరేశ్, ఆలయ ఏఈఓ హరిహరనాథ్,ప్రధాన అర్చకులు మారుతి ప్రసాద్,స్థానాచార్యులు కపీందర్,ఆలయ పరిశీలకులు అశోక్, అర్చకులు,సిబ్బంది పాల్గొన్నారు.

# సీజనల్ వ్యాధులపై అవగాహన



**ప్రజాపక్షం/మెట్‌పల్లి:** మెట్‌పల్లి మండలం లోని కొనరావుపేట గ్రామంలో మండల వైద్యాధికారి డాక్టర్ ఎల్లాల అంజిత్ రెడ్డి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా సీజనల్ వ్యాధుల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు రక్తపోటు,మధుమేహం వంటి దీర్ఘకాలిక వ్యాధుల గుర్తింపునకు వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు.వాతావరణ మార్పుల నేపథ్యంలో ప్రజలు పరిసరాల పరిశుభ్రత పాటించాలని, నీరు నిల్వ ఉండకుండా చూడాలని, అనారోగ్య లక్షణాలు కనిపిస్తే వెంటనే ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించాలని డాక్టర్ అంజిత్ రెడ్డి సూచించారు. దీర్ఘకాలిక వ్యాధులను ముందుగానే గుర్తించేందుకు క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ మారు గంగారెడ్డి, ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శి రాణప్రతాప్ పరంధాములు,సిహెచ్ఒ వెంకటలక్ష్మి ,హెచ్ఇఒ రమేష్, ఏఎన్ఎం,ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# జియో నెట్‌వర్క్ కష్టాలు.. వినియోగదారుల అవస్థలు!

**ప్రజాపక్షం/ఇబ్రహీంపట్నం :** జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలో గత మూడు, నాలుగు రోజులుగా జియో నెట్‌వర్క్ సమస్యలతో వినియోగదారులు, వ్యాపారస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సిగ్నల్స్ సరిగా అందకపోవడంతో ఫోన్ కాల్స్ స్పష్టంగా వినిపించకపోవడం, ఇంటర్నెట్ నెమ్మదిగా పనిచేయడం వల్ల నిత్యావసర పనులకు ఆటంకం కలుగుతోంది. ముఖ్యంగా ఫోన్ యాప్‌ల ద్వారా బ్యాంకింగ్ లావాదేవీలు,ఆన్‌లైన్ చెల్లింపులు నిర్వహించే వ్యాపారస్తులు ఇబ్బందులు పడుతున్నారు. డిజిటల్ చెల్లింపులపై ఆధారపడే ప్రస్తుత పరిస్థితుల్లో నెట్‌వర్క్ సమస్యల కారణంగా వ్యాపార కార్యకలాపాలు కూడా ప్రభావితమవుతున్నాయి. సంబంధిత జియో అధికారులు వెంటనే స్పందించి సాంకేతిక సమస్యలను పరిష్కరించి, నెట్‌వర్క్ సేవలను మెరుగుపరచాలని జియో వినియోగదారులు,వ్యాపారస్తులు కోరుతున్నారు.

# మహా బతుకమ్మ సంబరాలు



**ప్రజాపక్షం/జగిత్యాల టౌన్ :** జగిత్యాల పట్టణంలో మున్సిపల్ ఆధ్వర్యంలో నిర్వహించిన మహా బతుకమ్మ వేడుకలు పండుగ వాతావరణం నెలకొంది. మినీ స్టేడియం నుంచి మున్సిపల్ కార్యాలయం వరకు శోభాయాత్రనుజగిత్యాల మున్సిపల్ చైర్ పర్సన్ వాణి ప్రారంభించారు.తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను పురస్కరించుకొని మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని రంగురంగుల పూలతో అలంకరించిన బతుకమ్మలతో శోభాయాత్రలో సందడి చేశారు.తెలంగాణ సాంస్కృతిక వైభవాన్ని చాటుతూ, బతుకమ్మ పాటలు,ఆటలతో పట్టణంలో పండుగ వాతావరణం నెలకొంది.అనంతరం చింతకుంట చేరువులో మహా బతుకమ్మను నిమజ్జనం చేశారు.వేడుకల్లో జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్, ఎమ్మెల్యే సంజయ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సైగా రాజశేఖర్ బాధ్యతలు స్వీకరణ

**ప్రజాపక్షం/పెద్దపల్లి :** పెద్దపల్లి టౌన్ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓగా ఎస్సై జి. రాజశేఖర్ బుధవారం రోజున బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణ ధ్యేయంగా పనిచేస్తానని,ప్రజలకు ఏవైనా సమస్యలు ఉంటే తనను నేరుగా సంప్రదించాలని అన్నారు.ఈ సందర్భంగా స్టేషన్ సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

## రైల్వే గేట్ మూసివేత; దారి మళ్లింపు

**ప్రజాపక్షం/అంతర్గాం :** పెద్దపల్లి జిల్లా అంతర్గాం మండలం పెద్దంపేట రైల్వే గేట్ ను రైల్వే ట్రాక్ మరమ్మతుల కారణంగా బుధవారం ఉదయం 6 గంటల నుంచి గురువారం సాయంత్రం 6 గంటల వరకు మూసివేస్తున్నట్లు రైల్వే అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. రైల్వే గేట్ మూసివేతను గమనించి దారి మళ్లింపు ద్వారా ప్రయాణాలు కొనసాగించాలని అంతర్గాం మండలం, రామగుండం పట్టణ ప్రజలను కోరారు.

## కూరగాయల సాగుతో అధిక దిగుబడి

**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ :** పాలకుర్తి మండలంలో ఉద్యాన విస్తరణ అధికారి బోదుకల రాము పర్యటించి,అనంతరం పామాయిల్ తోటల్లో అంతర పంటగా సాగు చేస్తున్న బొప్పాయి,కాకరకాయ పంటలను పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సూపర్ ఎలినో నేపథ్యంలో తక్కువ నీటితో కూరగాయల సాగు లాభదాయకమని, ఉద్యాన శాఖ ద్వారా హెక్టారుకు పందిళ్లకు రూ. లక్ష,ఆధార కర్రలకు రూ. 10 వేలు, మల్చింగ్ షీట్ కు రూ.20 వేలు రాయితీ,అలాగే బిందు సేద్యం, మినీ ట్రాక్టర్లు, పవర్ స్ప్రేయర్లకు 50 శాతం రాయితీ అందిస్తున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో రైతులు మధునయ్య,గోవర్ధన్,గట్టయ్య, ఫీల్డ్ ఆఫీసర్లు ప్రశాంత్, రాజు,తదితరులు పాల్గొన్నారు.

## కార్యాలయాల్లో క్రమశిక్షణతో పరిపాలన అందించాలి

### జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష




**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ :** జిల్లాలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో క్రమశిక్షణతో కూడిన పరిపాలన అందించాలని, ఉద్యోగులు సమయపాలన పాటిస్తూ విధులకు హాజరయ్యేలా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష ఆదేశించారు.బుధవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్లు జే. అరుణశ్రీ, బి.శ్రీరాములుతో కలిసి వివిధ పరిపాలన అంశాలపై జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా మాట్లాడు తూ ప్రభుత్వ కార్యాలయాల్లో పనిచేసే ప్రతి ఉద్యోగి సమయానికి విధులకు హాజరుకావాలని,ఉద్యోగుల హాజరును అధికారులు క్రమం తప్పకుండా పర్యవేక్షించాలని తెలిపా రు. ప్రతి ఉద్యోగి 'మీ ప్రమాణం' యాప్‌లో నమోదు చేసుకునేలా చర్యలు తీసుకోవాలని, ఉద్యోగుల హాజరును ఈ యాప్ ద్వారా నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. జిల్లా అధికారులు తమ పర్యటనలకు సంబంధించిన టూర్ డైరీలను ప్రతి నెలా తప్పనిసరిగా సమర్పించాలని సూచించారు. విధుల నిర్వహణలో పారదర్శకత, జవాబుదారీతనంతో వ్యవహరిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని తెలిపారు.ప్రభుత్వ కార్యాలయాల్లో పెండింగ్‌లో ఉన్న కోర్టు కేసులు, సమాచార హక్కు చట్టం (ఆర్టీఐ) దరఖాస్తులు, ప్రజావాణి ఫిర్యాదులు, ఇతర పెండింగ్ ఫైళ్లను నిరంతరం సమీక్షించాలని కలెక్టర్ ఆదేశించారు. పెండింగ్ అంశాల పరిష్కారంలో ఎలాంటి జాప్యం జరగకుండా సంబంధిత అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని, వాటిని త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశా రు. ప్రతి ప్రభుత్వ కార్యాలయం, కార్యాలయ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ పరిపాలనాపరమైన అంశాలను ఎప్పటికప్పుడు సమీక్షించుకోవాలని,పెండింగ్ సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు .సమావేశంలో అందరూ జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## బదిలీపై వెళ్తున్న అధికారికి ఆత్మీయ సన్మానం

**ప్రజాపక్షం/రామగిరి :** రామగుండం3,అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా లో ఏరియా సెక్యూరిటీ ఆఫీసర్ గా విధులు నిర్వహిస్తూ ఒడిశా రాష్ట్రం లోని నైని ఏరియాకు బదిలీ పై వెళ్తున్న అబ్దుల్ షబ్బీరుద్దీన్ ను రామగుండం3 ఏరియా జనరల్ మేనేజర్ సుంకర మధుసూదన్,అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా జనరల్ మేనేజర్ కొలిపాక నాగేశ్వరరావు,వివిధ విభాగాల అధిపతులు బుధవారం జీఎం కార్యాలయంలో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు,అభినందనలు తెలియజేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏరియాలో విధేయతతో,అంకిత భావంతో అందించిన సేవలు ప్రశంసనీయమన్నారు.ఈ కార్యక్రమంలో ఎస్టేటుజియంలు యం.రామ్మోహన్, ఏరియా ఇంజినీర్ ఎ.ఉదయ భాస్కర్,



ప్రాజెక్ట్ ఆఫీసర్ ప్రవీణ్ వి ఫ్యాటింగ్, ఏరియా సేఫ్టీ ఆఫీసర్ జి.లక్ష్మీ నారాయణ,విభాగాధిపతులు బి.టి.మురళీ కృష్ణ, డాక్టర్ కల్యాణ్ చక్రవర్తి,అఫ్సర్ పాషా, కె.ఐలయ్య ,రవికుమార్, రాజా రవిచరణ్, ఆసిఫ్ యాసిన్,జ్ఞాన సంబంధన్, శ్రీకాంత్, ఎండీ.ఆసిఫ్, విక్రమ్, కోల శ్రీనివాస్, సుజీత్, ఇతర అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

## సద్దుల బతుకమ్మకు ముస్తాబవుతున్న అడవి శ్రీరాంపూర్

**ప్రజాపక్షం/ముత్తారం :** పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం అడవి శ్రీరాంపూర్ గ్రామ శివారులోని చెరువు వద్ద జరగనున్న సద్దుల బతుకమ్మ వేడుకలు,నిమజ్జన ప్రదేశ ఏర్పాట్లను బుధవారం గ్రామ పంచాయతీ కార్యదర్శి మల్లేశ్వరి, సర్పంచ్ బొంతల అన్నపూర్ణ ఉపేందర్, ఉప సర్పంచ్ అనవేన హరిత తిరుపతి,వార్డు సభ్యులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామ ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకునే బతుకమ్మ వేడుకలకు ఎలాంటి ఆటంకాలు కలగకుండా అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. గ్రామంలోని ప్రధాన వీధుల్లో రాత్రి వేళల్లో ఇబ్బందులు లేకుండా వీధి దీపాలు ఏర్పాటు చేస్తున్నామని, బతుకమ్మ ఆడే ప్రదేశంతో పాటు నిమజ్జన స్థలాన్ని సుందరీకరిస్తున్నట్లు వెల్లడించారు.

అలాగే వేడుకలకు వచ్చే భక్తులకు, మహిళలకు ఇబ్బంది కలగకుండా గ్రామంలో గుంతలుగా ఉన్న రహదారుల వెంబడి ఉప సర్పంచ్ అనవేన హరిత తిరుపతి ఆధ్వర్యంలో మొరం పోయించి రహదారులను తాత్కాలికంగా పునరుద్ధరించినట్లు పేర్కొన్నారు. గ్రామంలో పండుగ వాతావరణం ఉట్టిపడేలా ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ పాలకవర్గ సభ్యులతో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు.

## వచ్చే వేసవి నాటికి నిరాటంకంగా మంచినీరు

**ప్రజాపక్షం/గోదావరిఖని :** వచ్చే వేసవి కాలం నాటికి రామగుండం నగరంలో పైప్‌లైన్ల ద్వారా నిరంతరాయంగా రక్షిత మంచినీటిని సరఫరా చేసేందుకు చర్యలు చేపడుతున్నట్లు నగర మేయర్ మహంకాళి స్వామి తెలిపారు.ఇందులో భాగంగా బుధవారం నగరంలోని 7వ డివిజన్ పవర్‌హౌస్ కాలనీలో 13 లక్షల లీటర్ల సామర్థ్యం కలిగిన ఉపరితల జలాశయం నిర్మాణానికి సంబంధించి భూమి తవ్వకాల పనులను ప్రొక్లెయిన్ యంత్రానికి కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ,



ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ చొరవతో మంజూరైన అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ ఫండ్ (యూఐడీఎఫ్) కింద రూ.88 కోట్ల నిధులతో నగరంలో మంచినీటి సరఫరా వ్యవస్థను మెరుగుపరిచేందుకు పనులు చేపడుతున్నట్లు వెల్లడించారు. నగరంలో కొత్త వాటర్ ట్యాంకుల నిర్మాణంతోపాటు, ఇప్పటివరకు నీటి సరఫరా అందని ప్రాంతాలకు సైతం మంచినీటిని అందించేందుకు కొత్త పైప్‌లైన్ల నిర్మాణ పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ప్రజల ప్రస్తుత అవసరాలతోపాటు భవిష్యత్తులో పెరిగే నీటి అవసరాలను కూడా దృష్టిలో ఉంచుకుని ఈ అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టినట్లు పేర్కొన్నారు. ఈ పనులు పూర్తయితే నగర ప్రజలకు రక్షిత మంచినీటి సరఫరా మరింత మెరుగుపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు వేగోళపు శ్రీనివాస్ గౌడ్, వంగ శ్రీనివాస్ గౌడ్,నగరపాలక సంస్థ ఇన్‌చార్జి ఏసీపీ నవీన్,సంబంధిత ఏజెన్సీ ప్రతినిధులు పాల్గొన్నారు.

## మదర్ థెరిసా ఇంజినీరింగ్ కళాశాలలో ఘనంగా బతుకమ్మ వేడుకలు

**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ :** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ పండుగని ప్రిన్సిపాల్ డాక్టర్ టి. శ్రీనివాస్ అన్నారు. బుధవారం మదర్ థెరిసా ఇంజినీరింగ్ కళాశాలలో తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను విద్యార్థినులు,అధ్యాపకులు, సిబ్బంది సమక్షంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రాంగణం రంగురంగుల పూలతో పేర్చిన బతుకమ్మలతో పండుగ శోభను సంతరించుకుంది. విద్యార్థినులు సంప్రదాయ దుస్తులు ధరించి, వివిధ రకాల పూలతో అందంగా బతుకమ్మలను పేర్చి,బతుకమ్మ పాటలు పాడుతూ ఉత్సాహంగా సంబరాల్లో పాల్గొన్నారు. తెలంగాణ జానపద సంస్కృతి,సంప్రదాయాలను ప్రతిబింబించేలా నిర్వహించిన ఈ వేడుకలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి. శ్రీనివాస్ మాట్లాడుతూ, బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతి, మహిళల ఆత్మగౌరవం, ప్రకృతి ఆరాధనకు ప్రతీక అని పేర్కొన్నారు. విద్యార్థులు ఆధునిక విద్యను అభ్యసించడంతో పాటు మన సంస్కృతి, సంప్రదాయాలను గౌరవించి, భావితరాలకు వాటి గొప్పతనాన్ని తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల యాజమాన్య ప్రతినిధులు, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థినులు పాల్గొని బతుకమ్మ సంబరాలను విజయవంతం చేశారు.



## వార్డు మెంబర్స్ ఫోరం అధ్యక్షుడిగా సంతోష్

**ప్రజాపక్షం/అంతర్గాం :** తెలంగాణ వార్డు మెంబర్స్ ఫోరం అంతర్గాం మండల అధ్యక్షుడిగా విలేజ్ అంతర్గాం గ్రామ ఒకటో వార్డు సభ్యుడు కాంపెల్లి సంతోష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా కాంపెల్లి సంతోష్ మాట్లాడుతూ,తనను ఏకగ్రీవంగా ఎన్నుకున్న అంతర్గాం మండలంలోని తోటి వార్డు మెంబర్లకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. తన నియామకానికి సహకరించిన తెలంగాణ రాష్ట్ర వార్డు మెంబర్స్ ఫోరం అధ్యక్షురాలు నాగబెల్లి జ్యోతికి, మహేష్ కు, జిల్లా ఇన్‌చార్జి తప్పట్ల మోహన్ కు, రామగుండం నియోజకవర్గ ఇన్‌చార్జి స్వరూపకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. తనపై నమ్మకంతో ఈ బాధ్యతను అప్పగించిన ప్రతి ఒక్క వార్డు మెంబర్‌కు కృతజ్ఞతలు తెలుపుతూ,అందరి సహకారంతో వార్డు మెంబర్ల సమస్యల పరిష్కారానికి, వారి హక్కుల సాధనకు కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు.

## విగ్రహం వద్ద బౌద్ధ దమ్మ దీక్ష



**ప్రజాపక్షం/పెద్దపల్లి :** 8వ కాలనీ పోతన కాలనీలోని అంబేద్కర్ విగ్రహం వద్ద బుధవారం బౌద్ధ దమ్మ దీక్షా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వడకపురం చంద్రమౌళి అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా జిల్లా బౌద్ధ సంఘం ప్రధాన కార్యదర్శి మాసరాజయ్య హాజరై మాట్లాడుతూ, 1956 అక్టోబర్ 14న అంబేద్కర్ 5 లక్షల మందితో బౌద్ధ దీక్ష స్వీకరించారని, బహుజన సమాజం బుద్ధుని మార్గంలో నడవాలని పిలుపునిచ్చారు.అంబేద్కర్, బుద్ధుని చిత్రపటాలకు పూలమాలలు వేసి జ్యోతి ప్రజ్వలన చేశారు. కార్యక్రమంలో దుర్గాప్రసాద్,దశరథం గౌడ్,రాజరత్నం,రమేష్ రెడ్డి,తదితరులు పాల్గొన్నారు. ఆకునూరి రాజయ్య వందన సమర్పణ చేశారు.

## మంత్రి శ్రీధర్ చొరవతో సర్వారంలో 'సెంటర్ లైటింగ్' ప్రారంభం

**ప్రజాపక్షం/ముత్తారం :** ఐటి శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు చొరవతో సర్వారంలో 'సెంటర్ లైటింగ్' ఏర్పాటు చేయడం జరిగింది.పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం సర్వారం గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన సెంటర్ లైటింగ్ సిస్టమ్‌ను బుధవారం ఘనంగా ప్రారంభించారు.రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు ప్రత్యేక కృషి,చొరవతో మైదంబండ గ్రామపంచాయితీ పరిధిలోని సర్వారం గ్రామానికి ఈ లైటింగ్ మంజూరాయింది. ఐమస్ట్ లైట్ ప్రారంభం ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ముత్తారం మాజీ జెడ్పీటీసీ,జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు చొప్పరి సదానందం, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు దొద్ద బాలాజీ, ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మద్దెల రాజయ్య, గ్రామ సర్పంచ్ బియ్యని శివకుమార్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామంలో రాత్రి వేళల్లో వెలుగులు నింపడం,ప్రజల రాకపోకలకు వీలుగా భద్రత, సౌకర్యాన్ని పెంచడం కోసమే ఈ సెంటర్ లైటింగ్ సిస్టమ్‌ను ఏర్పాటు చేసినట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు,గ్రామస్తులు పాల్గొన్నారు.

## 18న సద్దుల బతుకమ్మ వేడుకలు

**ప్రజాపక్షం/రామగిరి :** రామగుండం3, అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియాల ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం 06:00 గంటల నుండి రాణి రుద్రమ దేవి క్రీడా ప్రాంగణం నందు సద్దుల బతుకమ్మ , ఫ్యామిలీ డే వేడుకలు నిర్వహించబడునని రామగుండం3, అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా అధికార ప్రతినిధి బి. సుదర్శనం ఒక ప్రకటన ద్వారా తెలియజేశారు.ఈ వేడుకల్లో భాగంగా బతుకమ్మ ఆటపాటలు నిర్వహించడం కోసం తగిన ఏర్పాట్లు చేయడమే కాకుండా ఉత్తమంగా తీర్చిదిద్దిన బతుకమ్మలను ఎంపిక చేసి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతో పాటు 10 ప్రోత్సాహక బహుమతులు ప్రధానం చేయబడునని అన్నారు. ఏరియాలో పనిచేస్తున్న ఉద్యోగులు,కాలనీ మహిళలు అధిక సంఖ్యలో బతుకమ్మలతో విచ్చేసి ఈ వేడుకలను జయప్రదం చేయవలసిందిగా కోరారు.

# భక్తిశ్రద్ధలతో ఘనంగా కుంకుమ పూజలు



**ప్రజాపక్షం / మందమర్రి:** మందమర్రి పట్టణంలోని రెండో జోన్‌లో శ్రీశ్రీ లక్ష్మీ కనక దుర్గ మండలి ఆధ్వర్యంలో శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని బుధవారం కుంకుమ పూజలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమంలో స్థానిక మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు, సామూహిక కుంకుమార్చనలు చేశారు. లోకకల్యాణం, కుటుంబాల్లో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు కలగాలని కోరుతూ భక్తులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అమ్మవారి నామ స్మరణతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేసి అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, కాలనీ మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

**రెబ్బెన:** బతుకమ్మ పండుగను పురస్కరించుకుని ఆసిఫాబాద్ జిల్లా రెబ్బెన మండలంలోని రాజారాం గ్రామంలో మహిళల సౌకర్యార్థం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. మహిళలు బతుకమ్మ ఆడే ప్రధాన ప్రాంగణంలో సర్పంచ్ లక్ష్మీ పురుషోత్తం, ఉపసర్పంచ్ ఎరుబోతుల శ్రీధర్ చొరవతో బుధవారం వీధి దీపాలను ఏర్పాటు చేయించారు. తెలంగాణ సంస్కృతికి ప్రతీకగా నిలిచే సాయంత్రం వేళల్లో మహిళలు ఎలాంటి ఇబ్బందులు పడకుండా చక్కటి వెలుతురు సౌకర్యం కల్పించారు. గ్రామంలో పండుగల వేళ ప్రజలకు మౌలిక వసతులు కల్పించడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# కిషన్‌రావుకు అంతర్జాతీయ పురస్కారం

**ప్రజాపక్షం / కాగజ్ నగర్:** తెలంగాణ ప్రైవేట్ విద్యాభివృద్ధికి చేస్తున్న సేవలకు గుర్తింపుగా టిఆర్ఎస్ఎంఎ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పెద్దపల్లి కిషన్‌రావు అంతర్జాతీయ పురస్కారాన్ని అందుకున్నారు. లక్నోలోని వరల్డ్ యూనిటీ కన్వెన్షన్ సెంటర్‌లో అక్టోబర్ 8 నుంచి 10 వరకు జరిగిన 18వ ఎడ్ లీడర్‌షిప్ ఇంటర్నేషనల్ రౌండ్ టేబుల్ సదస్సులో ఆయనను నిర్వాహకులు ప్రశంసాపత్రం, జ్ఞాపికతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కిషన్‌రావు మాట్లాడుతూ కృత్రిమ మేధస్సు యుగానికి అనుగుణంగా పాఠశాల విద్యావ్యవస్థలో మార్పులు రావాలని, డిజిటల్ తరగతుల ద్వారా విద్యార్థుల్లో సృజనాత్మకత, విమర్శనాత్మక ఆలోచనను పెంపొందించాలని సూచించారు. ప్రైవేట్ పాఠశాలల సమస్యల పరిష్కారం, ఉపాధ్యాయులు, విద్యార్థుల సంక్షేమానికి ఆయన చేస్తున్న కృషిని గుర్తించి ఈ పురస్కారాన్ని ప్రదానం చేశారు. అంతర్జాతీయ వేదికపై గుర్తింపు తెచ్చిన కిషన్‌రావుకు పలువురు విద్యావేత్తలు, టిఆర్ఎస్ఎంఎ ప్రతినిధులు అభినందనలు తెలిపారు.



# పాము కాటుకు గురైన 9 ఏళ్ల బాలుడికి జిజిహెచ్‌లో అత్యవసర చికిత్స

## ప్రాణాలు కాపాడిన పీడియాట్రిక్ వైద్యులు



**ప్రజాపక్షం / నిజామాబాద్ అర్బన్ :** అత్యంత ప్రమాదకరమైన కట్ల పాము కాటుకు గురై తీవ్ర నరాల సంబంధిత సమస్యలు, శ్వాస తీసుకోలేని స్థితిలో ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి జిజిహెచ్‌కి వచ్చిన 9 ఏళ్ళ బాలుడిని పీడియాట్రిక్ వైద్య బృందం సమయోచితంగా, సమర్థవంతంగా చికిత్స అందించి ప్రాణాపాయం నుంచి కాపాడింది. ఈ ఘనత సాధించిన వైద్యులను జిజిహెచ్ సూపరింటెండెంట్ డా. ఎల్.రాములు ప్రత్యేకంగా అభినందించారు. వివరాల్లోకి వెళ్తే అజాన్ అనే 9 ఏళ్ల బాలుడు ఈనెల 5వ తేదీ రాత్రి సుమారు పది గంటలకు కట్ల పాము కాటుకు గురయ్యాడు. మొదట బాన్సువాడలో ప్రాథమిక చికిత్సపొందిన అనంతరం, మెరుగైన చికిత్స కోసం అక్టోబర్ 6వ తెల్లవారుజామున 3.15 గంటలకు జిజిహెచ్ నిజామాబాద్‌లోని పీడియాట్రిక్ ఇంటెన్సివ్ కేర్ యూనిట్ లో చేర్పించారు. ఆసుపత్రికి వచ్చేసరికి బాలుడిలో కనురెప్పలు పడిపోవడం మాట స్పష్టంగా రాకపోవడం వంటి నరాల లక్షణాలు కనిపించాయి. చేరిన కొద్దిసేపటికే శ్వాస తీసుకోవడంలో తీవ్ర ఇబ్బంది ఏర్పడింది. దీంతో వైద్యులు తక్షణమే 20 వైల్స్ యాంటీ స్నేక్ వెనం అందించడంతో పాటు చికిత్స ప్రారంభించారు. శ్వాసకోశ సమస్య తీవ్రత దృష్ట్యా వెంటిలేటర్ పై ఉంచి, నిరంతర పర్యవేక్షణలో అన్ని సహాయక చికిత్సలు అందించారు. వైద్య బృందం నిరంతర పర్యవేక్షణ, సమగ్ర చికిత్స ఫలితంగా ఆసుపత్రిలో చేరిన మూడవరోజు బాలుడి ఆరోగ్యంలో మెరుగుదల కనిపించింది. నాలుగవరోజు వెంటిలేటర్ తొలగించేందుకు ప్రణాళిక రూపొందించారు. అనంతరం ఆరోగ్యం క్రమంగా మెరుగుపడడంతో నరాల సంబందిత లక్షణాలు తగ్గి, పూర్తిగా కోలుకున్నాడు. ప్రస్తుతం బాలుడి ఆరోగ్యం స్థిరంగా ఉండడంతోపాటు, నరాల పరీక్షలన్నీ సాధారణ స్థితికి చేరుకున్నాయి. ఈ సందర్భంగా జిజిహెచ్ సూపరింటెండెంట్ డా. ఎల్. రాములు మాట్లాడుతూ ఈ చికిత్సలో కీలకపాత్ర పోషించిన పీడియాట్రిక్స్ విభాగాధిపతి, ప్రొఫెసర్ డా. శ్రీకాంత్, డాక్టర్ వెంకటేశ్వర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్ డా. కీర్తి, పీడియాట్రిక్ వైద్య బృందాన్ని ప్రత్యేకంగా అబినందించారు.

# కలెక్టరేట్‌లో ఘనంగా బతుకమ్మ సంబురాలు

## గౌరీమాతకు పూజలు చేసిన కలెక్టర్



**ప్రజాపక్షం/నిజామాబాద్ :** బతుకమ్మ పండగనుపురస్కరించుకుని బుధవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (కలెక్టరేట్)లో టీఎన్‌జీఓ జిల్లా శాఖ ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఆయా శాఖల మహిళా ఉద్యోగినులు, వారి కుటుంబ సభ్యులతో కలిసి హాజరై ఈ ఉత్సవంలో భాగస్వాములయ్యారు. కలెక్టర్ ఇలా త్రిపాఠి, అదనపుకలెక్టర్ భుజంగరావు తదితరులు ఈ వేడుకల్లో పాల్గొని గౌరీ మాతకు రంగు రంగుల పూలతో ఆకట్టుకునే రీతిలో ముస్తాబు చేసిన బతుకమ్మలకు సాంప్రదాయబద్ధంగా పూజలు చేశారు. వివిధ శాఖల ఆధ్వర్యంలో అందంగా అలంకరించిన బతుకమ్మలు కనువిందు చేస్తూ పూల పండగ ప్రాధాన్యతను చాటాయి. బతుకమ్మ గేయాలను ఆలపిస్తూ మహిళా ఉద్యోగులు,యువతులు మహిళలు లయబద్ధంగా బతుకమ్మ ఆటలాడుతూ ఉత్సాహంగా సంబరాల్లో పాల్గొన్నారు. దాండియా, కోలాటాలతో బతుకమ్మ సంబురానికి వన్నె చేకూర్చారు. ఈ సందర్భంగా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో సందడి వాతావరణం నెలకొంది. కార్యాలయ పని వేళలు ముగిసినప్పటికీ ఉద్యోగినులు ఎవరూ ఇళ్లకు వెళ్లకుండా ఎంతో హుషారుగా ఈ ఉత్సవంలో పాల్గొని బతుకమ్మ వేడుక ఔన్నత్యాన్ని చాటారు. ఉత్తమ అలంకరణతో కూడిన బతుకమ్మలను ఎంపిక చేసి బహుమతులు అందజేశారు. ఈ ఉత్సవాల్లో టీఎన్‌జీఓ సంఘం జిల్లా అధ్యక్షులు సుమన్, రెవెన్యూ ఉద్యోగులసంఘం ప్రతినిధులు వివిధ శాఖల జిల్లా అధికారులు, పెద్దసంఖ్యలో మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు.

# గ్రాట్యుటీ జిఒతో ఉపాధి ఉద్యోగులకు ఆర్థిక భరోసా

## విబిజిరామ్‌జి జాక్ జిల్లా చైర్మన్ మల్లయ్య

**ప్రజాపక్షం / ఆసిఫాబాద్:** రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన గ్రాట్యుటీ జిఒ ఆర్‌టి నం.548తో గ్రామీణ ఉపాధి హామీ ఉద్యోగులకు పదవీ విరమణ సమయంలో ఆర్థిక భరోసా లభించిందని విబిజిరామ్‌జి. జాక్ జిల్లా చైర్మన్ గోగు మల్లయ్య తెలిపారు. 21 ఏళ్లుగా నిరంతర సేవలందిస్తున్న ఉద్యోగులకు ఈ నిర్ణయం ఎంతో ఊరటనిచ్చిందని పేర్కొన్నారు. ఎఫ్ టిఐ హోదాలో పనిచేసిన కాలం ఆధారంగా అర్హతను పరిగణిస్తారని, ఉద్యోగుల సుదీర్ఘ సేవలను గుర్తించి గరిష్ఠ పరిమితిని 16 లక్షల రూపాయలుగా నిర్ణయించారని వివరించారు. విబిజిరామ్‌జి. నిధుల ద్వారా అమలయ్యే ఈ పథకంతో జిల్లాలోని దాదాపు 120 మంది ఉద్యోగులకు లబ్ధి చేకూరుతుందని స్పష్టం చేశారు.

# నేరాల నియంత్రణలో నిర్లక్ష్యం తగదు

## పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా




**ప్రజాపక్షం / జైపూర్:** నేరాల నియంత్రణలో ఎలాంటి నిర్లక్ష్యం వహించరాదని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా స్పష్టం చేశారు. బుధవారం ఆయన జైపూర్ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసి స్టేషన్ పరిసరాలు, సిబ్బంది పనితీరు, రికార్డులను పరిశీలించారు. సిసిటిఎన్ఎస్ ఆన్‌లైన్ నమోదు, కేసుల అప్‌లోడ్ ప్రక్రియపై సిబ్బందితో సమీక్షించారు. ఈ సందర్భంగా సిపి మాట్లాడుతూ రౌడీషీటర్లు, సస్పెక్ట్ షీట్ వ్యక్తుల కదలికలపై నిరంతరం నిఘా ఉంచాలని ఆదేశించారు. స్టేషన్‌లో 5ఎస్ విధానాన్ని పక్కాగా అమలు చేస్తూ రికార్డులను క్రమబద్ధంగా ఉంచాలని సూచించారు. పెరుగుతున్న రోడ్డు ప్రమాదాల నివారణకు బ్లాక్ స్పాట్లలో హెచ్చరిక బోర్డులు, రంబుల్ స్ట్రిప్స్ ఏర్పాటు చేయాలని, అతివేగం, మద్యం తాగి వాహనాలు నడపడం, హెల్మెట్ లేని ప్రయాణాలపై కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ప్రజలు సిసి కెమెరాలు ఏర్పాటు చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. ఈ తనిఖీలో జైపూర్ ఏసిపి ఆర్. వెంకటేశ్వర్లు, సిఐ నవీన్ కుమార్, ఎస్ఐ భూమేష్ పాల్గొన్నారు.

# జర్నలిస్ట్ ఫసీయుద్దీన్‌ను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు

**ప్రజాపక్షం/నేరడిగొండ:** ప్రమాదంలో గాయపడి నేరడిగొండలో విశ్రాంతి తీసుకుంటున్న జర్నలిస్ట్ షేక్ ఫసీయుద్దీన్‌ను బోథ్ మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు బుధవారం పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి శ్రమించే జర్నలిస్టులకు అండగా ఉండటం అందరి బాధ్యత అన్నారు. కార్యక్రమంలో టీఆర్ఎస్ మండల నాయకులు పాల్గొన్నారు.

# విద్యుత్ కోతలపై ఆగ్రహించిన రైతులు

## సబ్‌స్టేషన్ ముట్టడి



**ప్రజాపక్షం/కమ్మర్‌పల్లి:** మండలంలోని నర్సాపూర్ గ్రామంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట రైతులు, టీఆర్ఎస్ కార్యకర్తలు బుధవారం నిరసన చేపట్టారు. సమయానికి నీరందక పంటలు ఎండిపోతున్నాయని, పెట్టుబడులు నష్టపోయే పరిస్థితి ఏర్పడిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయానికి త్రీఫేస్ కరెంట్ ఇవ్వకపోవటంతో మోటర్లు నడపటం లేదని లోవోల్టేజీతో బోరు మోటారు కాలిపోతున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. వ్యవసాయానికి నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని, సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమాచారం అందుకున్న విద్యుత్ అధికారులు రైతులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీనివ్వటంతో ఆందోళన విరమించారు.

# దుర్గాదేవి మంటపాల వద్ద అన్నసత్రాలు

**ప్రజాపక్షం/మోర్తాడ్ :** నిజామాబాద్ జిల్లా మోర్తాడ్ మండల కేంద్రంలో బుధవారం గ్రామంలోని దుర్గాదేవి మండపాల వద్ద మహాన్నదాన సత్రాలు నిర్వహించారు. ఉదయం దుర్గాదేవి మండపాల వద్ద కుంకుమపూజ నిర్వహించి గ్రామంలోని అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గాదేవి మండపం వద్ద మహిళలు కుంకుమ పూజా నిర్వహించారు.అలాగే అంబేద్కర్ యువజన సంఘం వద్ద మహాదేవుని ఆలయం వద్ద మహాన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఉదయం నుండి సాయంత్రం వరకు దుర్గాదేవి మండపాల వద్ద మహిళలు కుంకుమపూజ నిర్వహించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాశనేక మంది భక్తులు పాల్గొన్నారు.

# మొక్కల పెంపకంతోనే పర్యావరణ పరిరక్షణ

## ఎంపిడిఒ శ్రీనివాస్



**ప్రజాపక్షం / పెంచికల్‌పేట్:** పర్యావరణ సమతుల్యతను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటి సంరక్షించాలని ఎంపిడిఒ శ్రీనివాస్ పిలుపునిచ్చారు. బుధవారం మండలంలోని గుంట్లపేట గ్రామంలో నూతనంగా నిర్మించిన పోచమ్మ ఆలయ ఆవరణలో గ్రామస్తులతో కలిసి ఆయన జమ్మిచెట్టుతో పాటు వివిధ రకాల మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ పచ్చదనాన్ని పెంపొందించడం ద్వారానే భావితరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించగలమని, నాటిన ప్రతి మొక్కను సంరక్షించే బాధ్యత తీసుకోవాలని కోరారు. అనంతరం ఎంపిడిఒను గ్రామస్తులు శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దుర్గం పోషన్న, ఉపసర్పంచ్ గిరుగుల చిన్నయ్య, పంచాయతీ కార్యదర్శి చౌదరి రాకేష్, వార్డు సభ్యుడు బండి వెంకటాచలం, ఫీల్డ్ అసిస్టెంట్ తిరుపతి, గ్రామస్తులు రమేష్, మహేష్, నాగేష్, పెంటయ్య, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

## డాక్టర్ రాజేశ్వర్ కుటుంబాన్ని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే బోస్లే

**ప్రజాపక్షం/తానూర్ :** మండల కేంద్రానికి చెందిన ప్రముఖ వైద్యులు డాక్టర్ రాజేశ్వర్ ఇటీవల అనారోగ్యంతో అకాల మరణం చెందడం తీవ్ర విషాదం నింపింది.ఆయన మృతి వార్త తెలుసుకున్న ముధోల్ నియోజక వర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి, మాజీ శాసనస భ్యులు బోస్లే నారాయణరావు పటేల్ బుధు వారం ఆయన నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు.ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ, డాక్టర్ రాజేశ్వర్ మృతి తానూర్ ప్రాంతానికి తీరని లోటు అని అన్నారు.ఎంతో మందికి వైద్య సేవలు అందించిన మంచి వ్యక్తిని కోల్పోయామని ఆవేదన వ్యక్తం చేశారు. మృతుడి కుటుంబా నికి ప్రగాఢ సానుభూతి తెలియజేసి, కుటుం బానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.ఈ పరామర్శ కార్యక్రమంలో బైంసా బ్లాక్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు శంకర్ చంద్రే,తానూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్య క్షుడు హెచ్.పుండలిక్, చంద్రకాంత్ యాదవ్,గోవింద్ పటేల్,శివరాం చంద్రే,లక్ష్మ ణ్,మాజీ ఎంపీటీసీ మధు పటేల్, అటల్ దేవిదాస్‌తో పాటు వివిధ గ్రామాల సర్పంచులు,కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్య కర్తలు పాల్గొన్నారు.



**తానూర్ :** మండల కేంద్రానికి చెందిన డాక్టర్ రాజేశ్వర్ రావు ఇటీవల అనారోగ్యంతో స్వర్గ స్తులైన విషయం తెలుసుకున్న ముధోల్ మాజీ శాసనసభ్యులు జి.విఠల్ రెడ్డి బుధువారం వారి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు.డాక్టర్ రాజేశ్వర్ రావు మృతి పట్ల తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.కుటుంబ సభ్యులకు ప్రగాఢ సాను భూతి తెలియజేసి,వారికి ధైర్యం చెప్పారు.కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.ఈ పరామర్శ కార్యక్రమంలో ఆయన వెంట మాజీ సర్పంచ్ జాదవ్ మాధవ్ రావ్ పటేల్,మాజీ ఎంపీపీ రాజన్న, మాజీ ఆత్మ చైర్మన్ పోతరెడ్డి, మాజీ జడ్పీటీసీ భూచ్చన్న, కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ సెక్రెటరీ భీమ్రావు, మాజీ సర్పంచ్లు అబ్దుల్ గని,పిరజీ,శ్రీనివాస్ రెడ్డి,ధర్మేందర్ యోగేష్,నాగేష్,మండల సీని యర్ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## బాగాపూర్ గ్రామంలో పొలం బడి

**ప్రజాపక్షం/లోకేశ్వరం :** రైతులకు ఆరుతడి పంటలపై అవగాహన బాగా పూర్ గ్రామం లోని ఆత్మ చైర్మన్ గన్ను నర్సారెడ్డి,ఇఫ్కో డిస్టిక్ మేనేజర్ బాల వికాస్ రెడ్డి,మండల వ్యవసాయ అధికారి గిరిరాజు గ్రామంలోని సమావేశం రైతులతో ఏర్పాటు చేసి ఆరుతడి పంటలపై అవగాహన చేశారు.యాసంగి లో వరికి బదులుగా వేరుశనగ, జొన్న,మిను ములు,నువ్వులు,పెసర,శనగ, పొద్దుతిరు గుడు,ఆముదం, కుసుమ,ఆవాలు రైతులు చేనులో ఇవి పండించాలని తెలి పారు.యాసంగి పంటలు యాజమాన్య పద్ధ తులు పై బుక్లెట్ కుడా విడుదల చేయడం జరిగింది.నానో ఎరువుల వినియోగం వాటి ప్రయోజనాలు గురించి తెలియజేశారు.ఉప సర్పంచ్ ప్రియాంక,ప్రణీత్ రెడ్డి,ఏఈఓ మౌనిక,వార్డు సభ్యులు,పాల్గొన్నారు.

## పల్లెల్లో గుడుంబా చిచ్చు!

### మత్తు కోరల్లో యువత..
### రోడ్డున పడుతున్న పేద బతుకులు
### అధికారుల నిర్లక్ష్యంతో
### రెచ్చిపోతున్న సారా మాఫియా



**ప్రజాపక్షం / పెంచికలపేట్:** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో నాటుసారా మాఫియా మళ్లీ పడగవిప్పి పల్లెలను నిలువునా దహించివేస్తోంది. జిల్లాలోని పెంచికలపేట్, ద హెగాం, చింతలమానేపల్లి, కౌటాల, కాగజ్‌నగర్, బెజ్జూర్ మండలాల్లో గుడుంబా దందా స్వైరవిహారం చేస్తోంది. ఎక్సైజ్, పోలీసు యంత్రాంగం నిఘా పూర్తిగా కొరవడ టంతో అక్రమార్కులు ఏకంగా అటవీ శివారు ప్రాంతా ల్లోనే బట్టీలు పెట్టి పల్లెలకు విషాన్ని సరఫరా చేస్తున్నారు.

### అడవుల్లో తయారీ.. వీధుల్లో విక్రయాలు

దట్టమైన అటవీ ప్రాంతాలు, మారుమూల వాగుల పరిస రాలను కేంద్రాలుగా మార్చుకొని అక్రమార్కులు గుట్టుచ ప్పుడు కాకుండా భారీ ఎత్తున గుడుంబా బట్టీలను నడుపు తున్నారు. అక్కడి నుంచి ద్విచక్ర వాహనాలపై రహస్యంగా గ్రామాల్లోకి తరలించి, పగలు రాత్రి తేడా లేకుండా వీధి వీధినా గుట్టుగా విక్రయిస్తున్నారు. మద్యం ధరలు ఆకాశా న్నంటుతుండటంతో తక్కువ ధరకు దొరికే ఈ మత్తు వైపు జనం సులభంగా ఆకర్షితులవుతున్నారు. అక్రమ వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా విస్తరి స్తున్నా, అధికారులు అడపాదడపా చేసే తూతూమంత్రపు తనిఖీలతోనే సరిపెడుతున్నారనే విమర్శలు వ్యక్తమవుతు న్నాయి.రెక్కాడితే గానీ డొక్కాడని రోజువారీ కూలీలు, గ్రామాల్లోని యువత ఈ మత్తు ఊబిలో కూరుకుపోయి నిండు జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. రోజంతా కష్టపడి సంపాదించిన పైసలన్నీ ఈ సారా బట్టీలకే తగలే స్తుండటంతో వేలాది నిరుపేద కుటుంబాలు పస్తులుండా ల్సిన దుస్థితి దాపురించింది. ఇళ్లల్లో నిత్యం కలహాలు, గృహహింస పెరిగిపోయి ఆడబిడ్డలు కన్నీరుమున్నీరవుతు న్నారు. బంగారు భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాల్సిన యువత పెడదోవ పట్టి వ్యసనానికి బానిసలుగా మారడం పల్లెల్లో తీవ్ర ఆందోళన కలిగిస్తోంది.

### ప్రాణాలు తీస్తున్న కల్తీ విషం కట్టడిఅవసరం

సారా ఘాటు, మత్తు పెంచేందుకు ప్రమాదకర రసాయనా లతో పాటు కుళ్లిన పదార్థాలను విచ్చలవిడిగా వాడుతుండ టంతో ఇది ప్రాణాంతక విషంగా రూపాంతరం చెందు తోంది. ఈ విషపు సారా తాగి కాలేయాలు, మూత్రపిం డాలు పూర్తిగా దెబ్బతిని ఎంతోమంది అమాయకులు తీవ్ర అనారోగ్యంతో మంచాన పడుతున్నారు.క్షణిక మత్తు కోసం ప్రాణాలనే పణంగా పెడుతున్న పరిస్థితులు కనిపి స్తున్నాయి. మొక్కుబడి తనిఖీలు పక్కన పెట్టి సారా మాఫియా మూలాలను సమూలంగా కూలదోయాలి. తయారీ స్థావరాలను పూర్తిగా ధ్వంసం చేయడంతో పాటు, సారా తయారీకి అవసరమైన ముడిసరుకుల రవా ణాను మొదట్లోనే అడ్డుకోవాలి. ముఠాలపై పిడి యాక్టు తరహా చట్టాలను ప్రయోగించాలి. ఎక్సైజ్, పోలీసు శాఖల అధికారులుదృష్టి సారించి సమన్వయంతో ఉమ్మడి దాడులు నిర్వహిస్తేనే శాశ్వత అడ్డుకట్ట పడుతుంది.

## ధమ్మ చక్ర ప్రవర్తన్ దివస్ పోస్టర్ ఆవిష్కరణ

**ప్రజాపక్షం / ఆసిఫాబాద్:** జిల్లా కేంద్రంలోని లుంబినీ దీక్షాభూమిలో ఈ నెల 29న నిర్వహించే 70వ ధమ్మ చక్ర ప్రవర్తన్ దివస్ వేడుకల గోడప్రతులను అంబేద్కర్ సెంటర్ కమిటీ ప్రధాన కార్యదర్శి దుర్గం ప్రశాంత్ ఇతర నాయకు లతో కలిసి బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏటా ఘనంగా నిర్వహించే ఈ ఉత్స వాలకు తెలంగాణతో పాటు మహారాష్ట్ర నుంచి భారీగా ప్రజలు తరలివస్తారన్నారు. వేడుకల్లో భాగంగా బుద్ధుడు, అంబేద్కర్ ప్రతిమలతో శోభాయాత్ర, ప్రముఖుల ఉపన్యా సాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని వివరిం చారు. ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజ యవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్సి



సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ అశోక్, గుర్నులే నారాయణ, దుర్గం సందీప్, విజయ్ ఉప్రే, రోషన్ ఉప్రే, దుర్గం దుర్గాజీ, హంసరాజ్, దుర్గం శ్యాంరావు, దుర్గం అనిల్, రాజ్‌కుమార్, రాజేశ్వర్ పాల్గొన్నారు.

## రూ.5000 లంచం ఇవ్వలేదని మేకల కాపరిపై ఫారెస్ట్ డిఆర్ఓ దాడి

### రేస్ కుక్కలు మేకను చంపాయి, పెంబి ఎఫ్ఆర్ఓ ఆఫీస్ ముందు మేకతో టిఏజిఎస్ ధర్నా

**ప్రజాపక్షం/పెంబి :** మండలం ఆది వాసీ మేకల కాపరి ఆత్రం శేషే రావు,శ్రీనివాస్ నుండి గత జూన్ నెలలో పెంబి ఫారెస్ట్ డిఆర్ఓ రూ. 5000 లంచం డిమాండ్ చేశారు.లంచం ఇవ్వనందుకు కక్ష పెట్టుకొని,నిన్న అడవిలో మేకలు మేపుతుండగా అతనిపై విచక్షణార హితంగా దాడి చేసి కొట్టాడు. తీవ్రంగా గాయపడిన శేషేరావు ప్రస్తుతం ఖానాపూర్ ప్రభుత్వ ఆసుప త్రిలో చికిత్స పొందుతున్నాడు.ఈ అమానుష, అవినీతి చర్యను నిర సిస్తూ టిఏజిఎస్ పెంబి మండల కమిటీ ఆధ్వర్యంలో చనిపోయిన మేకను ముందుంచి పెంబి ఫ్ఆర్ఓ కార్యాలయం ముందు ధర్నా నిర్వ హించడం జరిగింది.

**మా డిమాండ్లు :** లంచం అడిగి,లంచం ఇవ్వలేదని ఎస్‌టి గిరి జనుడిపై దాడి చేసిన పెంబి ఫారెస్ట్ డిఆర్ఓ ను వెంటనే సస్పెండ్ చేసి ఎబిసి విచారణ జరిపించాలి.2. బాధి తుడిపై దాడిచెసిన వారిపై ఐపిసి 384 (లంచం/బెదిరింపు) కింద **కేసు నమోదు చేయాలి:** చనిపో యిన మేకకు,గాయపడిన కాపరికి నష్టపరిహారం 3 లక్షరూపాయలు చెల్లించాలి. తొడసం శంభు టిఏజిఎస్ నిర్మల్ జిల్లా కార్యదర్శి, ఆత్రం దానియల్,విలాస్ మాజీ సర్పంచ్, మచ్చ కంటి లక్ష్మి న్,పెంద్రం దత్తురామ్,తొడసం లక్ష్మి న్ రాయి, సెంటర్ సర్మేడీ కుద మెత మధు,తదితరులు ఉన్నారు.





**పెంబి :** పెంబి మండలంలోని తాటి గూడకు చెందిన ఆదివాసీ మేకల కాపరి ఆత్రం శేషురావు పై ఫారెస్ట్ డిప్యూటీ రేంజర్ రాథోడ్ ప్రతాప్ నాయక్ దాడి చేసిన ఘటన ఆల స్యంగా వెలుగులోకి వచ్చింది.ఫారెస్ట్ అధికారి బూటు కాళ్లతో నడుముపై తన్నడం వల్ల శేషురావు నిలబడలేక, లేచి కూర్చోలేక తీవ్ర ఇబ్బంది పడుతూ మంచాన పడ్డాడు. అడవిలో మేకలు మేపుకొని జీవనం సాగిస్తున్న గిరిజన కుటుంబాలపై దాడులు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పెరిగి పోతున్నాయని ఆరోపిస్తున్నారు. రాథోడ్ ప్రతాప్ నాయక్ నిన్న డ్యూటీలో కూడా లేడని తెలి సినా,అహంకారంతో, నియంతృత్వ పోకడలతో మేకల కాపరిపై దాడి చేశాడని సీపీఎం నాయకులు తీవ్రంగా ఖండిస్తున్నారు.

## ఎస్‌సిల సంక్షేమం కేంద్ర ప్రభుత్వ లక్ష్యం



**ప్రజాపక్షం/మంచిర్యాల టౌన్ :** ఎస్సీల సంక్షేమం కోసం పని చేస్తున్న ఏకైక ప్రభుత్వం కేంద్రంలోని బిజెపి ప్రభుత్వమని ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి అన్నారు. బుధవారం మంచి ర్యాల జిల్లా కేంద్రంలోని బిజెపి కార్యాలయంలో జిల్లా ఎస్సీ మోర్చా నూతన కార్యవర్గంను ప్రకటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం ఎస్సీల కోసం వారి సంక్షేమం కోసం చిత్తశుద్ధతో పని చేస్తుందన్నారు. బిజెపి అధ్యక్షుడు నగనూరి వెంకటేశ్వర్‌గౌడ్, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షునిగా చిలుముల శ్రీకృష్ణదేవరాయలతో కలిసి ప్రకటించారు. ఎస్సీల సంక్షేమం కోసం మంచిర్యాల జిల్లాలోని ఎస్సీ మోర్చా జిల్లా కమిటి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శులు వెంకటేశ్వర్‌రావు, కృష్ణమూర్తి, ఉపాధ్య క్షుడు పట్టి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## తలసేమియా వ్యాధిగ్రస్తులకు రక్తదాన శిబిరాలు నిర్వహించండి

**ప్రజాపక్షం/మంచిర్యాల టౌన్:** పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా రక్తదాన శిబిరాలను నిర్వహించాలని రామ గుండం పోలీసు కమీషనర్‌ను తలసేమియా వెల్ఫేర్ సొసైటీ రాష్ట్ర సంయక్తు కార్యదర్శి కాసర్ల రంజిత్‌కుమార్ బుధవారం ఒక ప్రకట నలో కోరారు. ఈ నెల 21న నిర్వహించే పోలీసు ఫ్లాగ్ డే, పోలీసుల అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని రామ గుండం పోలీసు కమీషనరేట్ పరిధిలోని అన్ని పోలీసు స్టేషన్ల ఆధ్వ ర్యంలో రెడ్‌క్రాస్ సొసైటీ బ్లడ్ బ్యాంక్ సకహారంతో రక్తదాన శిబిరాలు నిర్వహించాలని కోరారు. ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్ జిల్లాల నుండి అనేక మంది తలసేమియా బాధితులు రక్త మార్పడి కోసం మంచిర్యాలలోని బ్లడ్ బ్యాంకుకు వస్తున్నారని ఇలాంటి వారికి రక్తదాన శిబిరాలు ఉపయోగకరంగా ఉంటాయని పేర్కొన్నారు.

## మన్నుబాయి మరణం తీరని లోటు

### ఖానాపూర్ ఎమ్మెల్యే వేడ్మ బొజ్జు పటేల్



**ప్రజాపక్షం/జైనూర్:** జైనూర్ మేజర్ గ్రామపంచాయతీ మాజీ సర్పంచ్ కొడప మన్నుబాయి మరణం తీరని లోటని ఖానాపూర్ ఎమ్మెల్యే వేడ్మ బొజ్జు పటేల్ అన్నారు. ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన ప్రస్తుత సర్పంచ్ కొడప ప్రకాష్ మాతృమూర్తి మన్నుబాయి కుటుంబాన్ని బుధవారం ఆయన పరామర్శించారు. ఆమె చిత్రపటా నికి పూలమాల వేసి నివాళులర్పించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. జైనూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ కుడ్మెత విశ్వనాథ్‌రావు, పిఎసిఎస్ చైర్మన్ కొడప హన్ను పటేల్, పార్టీ మండల అధ్యక్షులు షేక్ రషీద్, ఆత్రం శంకర్, సీనియర్ నాయకుడు మెస్రం అంబాజీ, సర్పంచులు తొడసం రాజేందర్, కనక ప్రతిభ, మడావి మనోహర్, పెందుర్ గణ పత్, మెస్రం స్పందన భూపతి, ఆత్రం మీరా జాలీంషా, మాజీ వైస్ ఎంపిపి చిర్లె లక్ష్మ ణ్ యాదవ్, నాయకులు పెందుర్ ప్రకాష్, ఆడ అమృత్ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్‌టిసి విచారణ కోసం ప్రత్యేక ఫోన్ నంబర్

**ప్రజాపక్షం / ఆసిఫాబాద్:** ఆసిఫాబాద్ డిపో పరిధిలోని ప్రయాణి కులకు సత్వర సమాచారం అందించేందుకు ప్రత్యేక బస్ స్టేషన్ ఎంక్వైరీ ఫోన్ నంబర్‌ను అందుబాటులోకి తెచ్చినట్లు డిపో మేనేజర్ ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ ప్రాంతాలకు నడిచే ఆర్‌టిసి బస్సుల వేళలు, సర్వీసులు, రిజర్వేషన్ వివరాల కోసం ప్రయాణికులు 9493282510 నంబర్‌ను సంప్రదించవచ్చని పేర్కొన్నారు. ఈ సేవలు ఉదయం 4:00 గంటల నుంచి రాత్రి 11:00 గంటల వరకు అందుబాటులో ఉంటాయని వివరించారు. ప్రైవేటు వాహనాలను ఆశ్రయించి ప్రమాదాల బారిన పడకుండా, సురక్షితమైన, సౌకర్యవం తమైన ఆర్‌టిసి బస్సుల్లోనే ప్రయాణించాలని ఆయన కోరారు.

## శాస్త్రీయ పద్ధతులతో నాణ్యమైన దిగుబడులు



ప్రజాపక్షం/సుల్తానాబాద్ : రైతులు శాస్త్రీయ పద్ధతులను అనుసరించడం ద్వారా నాణ్యమైన దిగుబడులు పొందవచ్చు అని సర్పంచ్ ఉప్పు లక్ష్మి అన్నారు.పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండలం మంచిరామి గ్రామంలో కోహినూర్ సీడ్ ఫిలిప్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో పత్తి రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పత్తి సాగులో అనుసరించాల్సిన ఆధునిక సాగు విధానాలు,అధిక దిగుబడులు సాధించే మెళకువలు, పంట యాజమాన్య పద్ధతులపై రైతులకు విస్తృతంగా అవగాహన కల్పించారు.మంచిరామి గ్రామ సర్పంచ్ ఉప్పు లక్ష్మి ,రిటైర్డ్ ఐపీఎస్ అధికారి ఉప్పు తిరుపతికి చెందిన పత్తి చేనులో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పలువురు రైతులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా కోహినూర్ సీడ్ కంపెనీ తెలంగాణ ప్రతినిధి దేవరబోయిన కిషన్ మాట్లాడుతూ పత్తి సాగులో శాస్త్రీయ పద్ధతులను అనుసరించడం ద్వారా నాణ్యమైన దిగుబడులు సాధించవచ్చని తెలిపారు.విత్తనాల ఎంపిక, ఎరువుల వినియోగం, చీడపీడల నివారణ,పంట సంరక్షణ వంటి అంశాలపై రైతులకు పలు సూచనలు, సలహాలు అందించారు.రైతులు ఆధునిక వ్యవసాయ సాంకేతికతను అందిపుచ్చుకొని, శాస్త్రీయ సాగు పద్ధతులను అనుసరించడం ద్వారా అధిక దిగుబడులు సాధించి ఆర్థికంగా మరింత అభివృద్ధి చెందాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో పాల్గొన్న రైతులు పత్తి సాగుకు సంబంధించిన పలు సందేహాలు నివృత్తి చేసుకొని,సంస్థ ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు.

## రోడ్లపై అక్రమ పార్కింగ్, ఆక్రమణల తొలగింపు

### ఎస్ఐ చంద్రకుమార్

ప్రజాపక్షం/సుల్తానాబాద్ : సుల్తానాబాద్ పట్టణంలో ట్రాఫిక్ సమస్యలను నివారించి ప్రజలకు, వాహనదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉండేలా పోలీసులు, మున్సిపల్ అధికారులు సంయుక్తంగా సందర్భంగా సుల్తానాబాద్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా నుంచి కాల్వ శ్రీరాంపూర్ వైపు వెళ్లే రహదారిపై డివైడర్ పక్కన అక్రమంగా పార్క్ చేసిన వాహనాలను ఎస్ఐ చంద్రకుమార్ తన సిబ్బందితో కలిసి తొలగించారు.రహదారులపై నిబంధనలకు విరుద్ధంగా వాహనాలను నిలిపి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆటో, జీప్ యజమానులను హెచ్చరించారు.అదేవిధంగా సుల్తానాబాద్ మున్సిపల్ కార్యాలయానికి వెళ్లే రహదారికి ఇరువైపులా కిరాణా దుకాణాల ముందు ఉన్న ఆక్రమణలను,రహదారిని ఆనుకుని ఏర్పాటు చేసిన పండ్ల దుకాణాలను మున్సిపల్ కమిషనర్ రమేష్ ఆధ్వర్యంలో మున్సిపల్ సిబ్బంది తొలగించారు.రోడ్లను ఆక్రమించి ప్రజలకు,వాహనదారులకు రాకపోకల్లో ఇబ్బందులు కలిగించవద్దని ఎస్ఐ చంద్రకుమార్ సూచించారు.ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ రహదారులు, ఫుట్‌పాత్‌లను ఆక్రమించకుండా ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## బుధవారం ఉదయం సూర్యకిరణాల తాకిడిలో కనకాపూర్ కనకదుర్గాదేవి

ప్రజాపక్షం/లోకేశ్వరం : లోకేశ్వరం మండలం కనకాపూర్ గ్రామంలోని శ్రీ కనకదుర్గాదేవి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం అమ్మవారు శ్రీ లలితాదేవి అవతారంలో భక్తులకు కొలువుదీరారు. ఎరుపు రంగు వస్త్రాలు,బంగారు ఆభరణాలు, పుష్పమాలలతో అలంకరించిన అమ్మవారు భక్తులను విశేషంగా ఆకట్టుకుంటున్నారు. అమ్మవారిని తాకిన తొలి సూర్యకిరణాలు.. భక్తులకు కనువిందు బుధవారం ఉదయం ఆలయంలో ఓ ప్రత్యేకమైన ఆధ్యాత్మిక వాతావరణం కనిపించింది. ఉదయపు సూర్యకిరణాలు అమ్మవారి విగ్రహాన్ని తాకడంతో ఆలయ ప్రాంగణం భక్తిభావంతో మరింత శోభాయమానంగా మారింది. అమ్మవారి అలంకరణపై సూర్యకాంతి ప్రసరించిన దృశ్యం భక్తులను ఆకట్టుకుంది. ఈ అద్భుత దృశ్యం అమ్మవారి దివ్య సన్నిధిలో భక్తులకు ఆహ్లాదకరమైన అనుభూతిని కలిగించింది.శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని ఆలయంలో ప్రతి రోజూ అమ్మవారికి ప్రత్యేక అలంకరణలు,పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకునేందుకు పరిసర గ్రామాల నుంచి భక్తులు తరలివస్తున్నారు. అమ్మవారి కృపతో ప్రజలందరూ సుఖసంతోషాలతో,ఆయురారోగ్యాలతో ఉండాలని భక్తులు ప్రార్థిస్తున్నారు.



## మంత్రి శ్రీధర్ బాబు చొరవతో తీరిన ఓవర్‌లోడ్ సమస్య

ప్రజాపక్షం/ముత్తారం : మంత్రి శ్రీధర్ బాబు ప్రత్యేక చొరవతో ఓవర్ లోడ్ సమస్యకు పరిష్కారం లభించిందని సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు, మైదంబండ గ్రామ సర్పంచ్ బియ్యని శివకుమార్ అన్నారు.బుధవారం పెద్దపెల్లి జిల్లా ముత్తారం మండలం మైదంబండ గ్రామ పరిధిలోని గత కొంతకాలంగా వేధిస్తున్న విద్యుత్ అధిక లోడు సమస్యకు శాశ్వత పరిష్కారం లభించింది.రాష్ట్ర శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ప్రత్యేక చొరవతో గ్రామంలో 100 KVA నూతన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసి, విద్యుత్ సరఫరాను విజయవంతంగా పునరుద్ధరించారు.మైదంబండ పరిధిలోని వ్యవసాయ బావుల వద్ద విద్యుత్ లోడ్ పెరిగిపోవడంతో తరచూ అంతరాయాలు ఏర్పడి పంటలు ఎండిపోయే పరిస్థితి నెలకొంది. ఈ విషయాన్ని స్థానిక రైతులు మంత్రి శ్రీధర్ బాబు దృష్టికి తీసుకెళ్లగా,ఆయన తక్షణమే స్పందించి విద్యుత్ శాఖ అధికారులతో మాట్లాడి కొత్త ట్రాన్స్‌ఫార్మర్ మంజూరు చేయించారు.తాజాగా ఏర్పాటు చేసిన ఈ



100 KVA ట్రాన్స్‌ఫార్మర్ ద్వారా మైదంబండ గ్రామానికి చెందిన 18 మంది రైతుల పరిధిలోని సుమారు 40 ఎకరాల పంట పొలాలకు బ్రేక్ లేకుండా సాగునీరు అందుతోంది. ఎండిపోయే దశకు చేరిన పంటలకు సమయానికి నీరు అందడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. తమ సమస్యను తక్షణమే పరిష్కరించి, పంటలను కాపాడిన ప్రియతమ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుకు ఈ సందర్భంగా మైదంబండ గ్రామ రైతాంగం ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## దుర్గా నవరాత్రుల నాలుగో రోజు ఘనంగా కూష్మాండ దేవి పూజలు

ప్రజాపక్షం/సుల్తానాబాద్ : దుర్గా నవరాత్రుల సందర్భంగా సుల్తానాబాద్ పట్టణంలోని పూసాల భక్త మార్కండేయ దేవాలయంలో నాలుగో రోజు ప్రత్యేక పూజా కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని కూష్మాండ దేవి అవతారంలో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.వేద పండితుల ఆధ్వర్యంలో నిత్య పూజా కార్యక్రమాలతో పాటు సర్వతోభద్ర మండల పూజ,నవగ్రహ పూజ, బ్రహ్మ కలశ స్థాపన, అమ్మవారికి నిత్యాభిషేకం తదితర విశేష పూజలు నిర్వహించారు.అనంతరం నిత్య అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించగా, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారి తీర్థప్రసాదాలను స్వీకరించారు. ఈ సందర్భంగా పాల్గొన్న భక్తులందరూ దుర్గామాత అనుగ్రహానికి పాత్రులై, అమ్మవారి ఆశీస్సులు ఎల్లప్పుడూ ప్రజలపై



ఉండాలని దేవాలయ కమిటీ సభ్యులు ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటీ చైర్మన్ వలసని లయ్య,భాస్కర్, బీ.కాం శంకరయ్య,పి. కిషన్,ఆంజనేయులు పెగడ,అడిగొప్పుల లింగమూర్తి,ఉద్గాల రమేష్, శ్రీరాములు శంకర్,కండక్టర్ శంకరయ్య,కంకణాల నవీన్‌తో పాటు పూసాల గ్రామ ప్రజలు,సుల్తానాబాద్ పట్టణానికి చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## టిహెచ్‌డబ్ల్యుయు దశాబ్ది ఉత్సవాలు జయప్రదం చేయాలి

ప్రజాపక్షం/పెద్దపల్లి : పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డ్ ఆవరణలో అక్టోబర్ 25న నిర్వహించే తెలంగాణ హమాలీ వర్కర్స్ యూనియన్ దశాబ్ది ఉత్సవాలను జయప్రదం చేయాలని రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు గుంటి సామ్రాజ్యం, అన్నేడి వెంకట్ రెడ్డి పిలుపునిచ్చారు.బుధవారం పెద్దపల్లి జిల్లా కేంద్రంలో దశాబ్ది ఉత్సవాల కరపత్రాలను ప్రభుత్వ విప్ పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు ఆవిష్కరించారు.ఈ సందర్భంగా తెలంగాణ హమాలి వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు మాట్లాడుతూ భద్రత భరోసా లేకుండా బరువులు బస్తాలను మోస్తు బతుకులు వెళ్లదీస్తున్న హమాలీ కార్మికులకు అండగా తెలంగాణ హమాలి వర్కర్స్ యూనియన్ కార్మిక సంఘాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని తెలియజేశారు. ఏ రాజకీయ



పార్టీలకు అనుబంధం కాకుండా బస్తా మోసే హమాలీ కార్మికులే నాయకులుగా తెలంగాణ హమాలీ వర్కర్స్ యూనియన్ ఆవిర్భావం నుండి రాష్ట్రంలోని వివిధ సంస్థలు స్థలాలు ప్రదేశాలలో పనిచేస్తున్న హమాలి కార్మికులందరినీ ఐక్యం చేస్తూ కార్మిక హక్కులు, చట్టాలపై అవగాహన కల్పిస్తూ 10 సంవత్సరాల కాలంలో అనేక ఆటుపోట్లను ఎదుర్కొని కార్మిక క్షేత్రమైన పెద్దపల్లి జిల్లాలో అక్టోబర్ 25న సంఘం దశాబ్ది ఉత్సవాలను నిర్వహిస్తున్నామని ఈ దశాబ్ది ఉత్సవాలకు జిల్లా నలుమూలల నుండి పెద్ద ఎత్తున హమాలీ కార్మికులు హాజరై జయప్రదం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ హమాలి వర్కర్స్ యూనియన్ లీగల్ అడ్వైజర్, ఏజిపి ఉప్పు రాజన్న,కాంగ్రెస్ సీనియర్ నాయకులు గోపగాని సారయ్య గౌడ్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు భూతగడ్డ సంపత్,నల్లగొండ కుమార్,బండారి సునీల్, యూనియన్ నాయకులు జంగ సంపత్, కొమ్ము మధుకర్,కామ భూమయ్య, పాల్గొన్నారు.

## మహాపోచమ్మకు వెండి కిరీటం...!

### బహుకరించిన కొట్లబి గ్రామస్తులు



ప్రజాపక్షం/సారంగాపూర్ : దేవీ నవరాత్రుల్లో భాగంగా శ్రీ మహా పోచమ్మకు మండలంలోని కొట్ల బి గ్రామస్తులు బుధవారం వెండి కిరీటాన్ని బహుకరించారు.దుర్గాదేవి స్వాములతో పాటు గ్రామస్తులు గ్రామం నుండి శ్రీ అడెల్లి మహా పోచమ్మ ఆలయం వరకు పాదయాత్రతో భక్తి గేయాలతో,నృత్యాలతో తరలివచ్చి ప్రధాన అర్చకులు శ్రీనివాస్ శర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజల అనంతరం పోచమ్మ విగ్రహానికి అలంకరించి తీర్థ ప్రసాదాలను అందజేశారు. గ్రామస్తుల సమక్షంలో మహా అన్నదానం కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ అట్ల మహిపాల్ రెడ్డి,పిఎసిఎస్ చైర్మన్ ఐరా నారాయణరెడ్డి, మహిళలు,యువకులు,తదితరులు పాల్గొన్నారు.

## జిల్లాస్థాయి ఖో-ఖో పోటీల్లో సుల్తానాబాద్ గురుకుల విద్యార్థుల ప్రతిభ

### రాష్ట్రస్థాయి పోటీలకు నలుగురు విద్యార్థుల ఎంపిక



ప్రజాపక్షం/సుల్తానాబాద్ :పెద్దపల్లి జిల్లా ఖోఖో అసోసియేషన్ ఆధ్వర్యంలో జెడ్పీహెచ్ఎస్ రాఘవపూర్‌లో నిర్వహించిన పెద్దపల్లి జిల్లాస్థాయి ఖోఖో పోటీల్లో తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల,సుల్తానాబాద్‌కు చెందిన నలుగురు విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు.గురుకుల పాఠశాలకు చెందిన పి.అశ్విత్, సీహెచ్. చక్రీ, ఎం.ప్రవీణ్,సీహెచ్.హరీష్ తమ అద్భుత ఆటతీరుతో ఆకట్టుకుని,ఈ నెల 15,16,17 తేదీలలో రంగారెడ్డి జిల్లా సరూర్‌నగర్‌లో జరిగే రాష్ట్రస్థాయి ఖోఖో పోటీల్లో పెద్దపల్లి జిల్లా జట్టు తరఫున పాల్గొననున్నారు.ఈ సందర్భంగా రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ కె. కోటి, పీడీ ప్రసాద్, పీఈటీ సురేందర్,ఉపాధ్యాయులు అభినందించి, రాష్ట్రస్థాయిలోనూ అత్యుత్తమ ప్రతిభ కనబర్చి జిల్లా, పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

## సద్దుల బతుకమ్మ సాంగ్ 'సాగి రవమ్మా' విడుదల!

### ముఖ్య అతిథిగా హాజరైన డైరెక్టర్ నరేష్ వర్మ

ప్రజాపక్షం/ముత్తారం :పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం ఖమ్మంపల్లి గ్రామానికి చెందిన యువకులు ప్రతిష్ఠాత్మకంగా నిర్మించిన బతుకమ్మ ప్రత్యేక గీతం 'సాగి రవమ్మా సద్దుల బతుకమ్మ' బుధవారం ఘనంగా విడుదలయింది. స్థానిక దుర్గామాత ఆలయం వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో ఈ పాటను రిలీజ్ చేశారు.ఈ కార్యక్రమానికి ప్రముఖ డైరెక్టర్ నరేష్ వర్మ ముఖ్య అతిథిగా విచ్చేశారు. గోదావరిఖని లీడర్ యూత్ ఆధ్వర్యంలో జరిగిన ఈ రిలీజ్ వేడుకలో ఖమ్మంపల్లి ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని, కార్యక్రమాన్ని అత్యంత విజయవంతం చేశారు. గ్రామీణ యువత ప్రతిభను,సంస్కృతిని చాటిచెప్పేలా రూపొందించిన ఈ సాంగ్ అందరినీ విశేషంగా ఆకట్టుకుంటోంది.



## ఘనంగా ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశం



ప్రజాపక్షం/గొల్లపల్లి: జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలంలోని లోత్తునూరు గ్రామంలో లబ్ధిదారులు ఓరుగంటి మరియమ్మ, నరసయ్యల ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశ కార్యక్రమం బుధవారం అత్యంత ఘనంగా జరిగింది. రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మ ణ్ కుమార్ ఆదేశాల మేరకు,లబ్ధిదారుల ఆహ్వాన మేరకు కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు,ప్రజాప్రతినిధులు ఈ కార్యక్రమానికి హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.నిరుపేదలకు సొంతింటి కలను నిజం చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, మంత్రి అడ్లూరి లక్ష్మ ణ్ కుమార్ నాయకత్వంలో నియోజకవర్గ సంక్షేమ,అభివృద్ధి కార్యక్రమాలు మరింత వేగంగా ముందుకు సాగుతున్నాయని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు ముస్కు నిశాంత్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ భీమా సంతోష్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రాపల్లి గంగన్న, జనరల్ సెక్రటరీ అనిల్, పాల్గొన్నారు.

## టిజెఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా కంతి మోహన్ రెడ్డి

ప్రజాపక్షం/మెట్‌పల్లి: తెలంగాణ జన సమితి (టిజెఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా కంతి మోహన్ రెడ్డి నియమితులయ్యారు. మంగళవారం హైదరాబాద్‌లో పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం 2026–28 నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. పార్టీ అభివృద్ధికి మోహన్ రెడ్డి చేసిన సేవలను గుర్తించి ఈ బాధ్యతలు అప్పగించినట్లు తెలిపారు.1997లో న్యాయశాస్త్రం పూర్తి చేసిన మోహన్ రెడ్డి మెట్‌పల్లి కోర్టులో న్యాయవాదిగా ప్రాక్టీస్ ప్రారంభించారు.మెట్‌పల్లి బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా నాలుగుసార్లు ఎన్నికయ్యారు. ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న ఆయన, 2018లో టీజేఎస్‌లో చేరారు. కోరుట్ల నియోజకవర్గ ఇన్‌చార్జిగా, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జిగా,పార్టీ రైతు విభాగం రాష్ట్ర అధ్యక్షుడిగా పనిచేశారు. తాజాగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమితులయ్యారు.

## మోదీ జన్మదినం సందర్భంగా పండ్ల పంపిణీ

ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్: ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినం పురస్కరించుకుని సేవా సంకల్పం అభియాన్ లో భాగంగా పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని మానసిక వికలాంగులకు పండ్లు పంపిణీ చేశారు.బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షులు చాతరాజు రమేష్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, మోదీ నిండు నూరేళ్లు ఆరోగ్యంగా ఉండాలని, ఆయన సేవలు దేశానికి అవసరమని అన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లె సదానందం, ఓబీసీ నాయకులు సదయ్య,మనోహర్, శ్రీనివాస్,తదితరులు పాల్గొన్నారు.

# పారిశుద్ధ్య రహిత గ్రామమే మా సంకల్పం



ప్రజాపక్షం/ముత్తారం : పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలంలోని అడవి శ్రీరాంపూర్ గ్రామ పంచాయతీ పారిశుద్ధ్య నిర్వహణలో ఆదర్శంగా నిలుస్తోంది.గ్రామంలో నిత్యం క్రమం తప్పకుండా చెత్త సేకరణ కార్యక్రమాలను నిర్వహిస్తూ గ్రామ పంచాయతీ కార్యదర్శి మల్లేశ్వరి,సర్పంచ్ బొంతల అన్నపూర్ణ ఉపేందర్,ఉప సర్పంచ్ అనవేన హరిత తిరుపతి పాలకవర్గం, అధికారుల ప్రశంసలు అందుకుంటున్నారు.ఉన్నతాధికారుల ఆదేశాలను తూచా తప్పకుండా పాటిస్తూ, పంచాయతీ సిబ్బంది, ట్రాక్టర్ సహాయంతో ప్రతిరోజూ గ్రామంలోని వీధుల వెంబడి చెత్తను సేకరిస్తున్నారు.నిరంతరం పారిశుద్ధ్య పనులు చేపడుతుండటంతో గ్రామస్థులు పంచాయతీ యంత్రాంగానికి శభాష్ అంటూ అభినందనలు తెలుపుతున్నారు.ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ బొంతల అన్నపూర్ణ ఉపేందర్ మాట్లాడుతూ పాలకవర్గం,అధికారుల సమన్వయంతో అడవి శ్రీరాంపూర్‌ను పూర్తి పారిశుద్ధ్య రహిత గ్రామంగా తీర్చిదిద్దడమే తమ ముఖ్య లక్ష్యమని పేర్కొన్నారు. గ్రామ శుభ్రతకు ప్రజలు కూడా సహకరించాలని వారు కోరారు.

# రామగుండం సిపిని కలిసిన ఎంఐఎం

### ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు గులాం అహ్మద్ హుస్సేన్



ప్రజాపక్షం/పెద్దపల్లి : ఎంఐఎం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ ఆధ్వర్యంలో పెద్దపల్లి జిల్లా ఎంఐఎం నాయకులు, రామగుండం పోలీసు కమిషనర్ అంబర్ కిషోర్ ఝూను, పోలీస్ కమిషనరేట్ లో మర్యాద పూర్వకంగా కలిశారు. ఎంఐఎం అధినేత, హైదరాబా టద్ ఎంపీ బారిస్టర్ అసదుద్దీన్ ఒవైసీ ఆదేశాల మేరకు కలిసినట్లు గులాం అహ్మద్ హుస్సేన్ తెలిపారు.గులాం అహ్మద్ ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షుడుగా ఎన్నికైన తర్వాత పెద్దపల్లి జిల్లా నాయకులతో కలిసి, రామగుండం పోలీసు కమిషనర్ ను కలవడం పార్టీలో ప్రాధాన్యత సంతరించుకుంది. ఈసందర్భంగా గులాం అహ్మద్ హుస్సేన్ మాట్లాడుతూ పెద్దపల్లి జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణ కోసం, తమ వంతుగా పోలీసు శాఖకు సహాయ సహకారాలు అందిస్తామని చెప్పారు. ఈకార్యక్రమంలో ఎంఐఎం పెద్దపల్లి నాయకులు ఇమ్రాన్ అడ్వకేట్, ఉమేర్, కలీం, గోదావరిఖని నాయకులు మీర్ జాకీర్ అలీ, ఖాదర్ అలీ నాయబ్,రామగుండం నాయకులు నసిర్,ఆర్బాజ్, కరీంనగర్ నాయకులు అబ్దుల్ గఫ్ఫార్, మెరాజోద్దీన్,షాకిర్ నహ్రి, అబ్దుల్లాఖాన్,అయాన్ నహ్రీ,తదితరులు పాల్గొన్నారు.

# డంపింగ్ యార్డు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి

### డిసిసి అధికార ప్రతినిధి అనంతుల రమేశ్ డిమాండ్



ప్రజాపక్షం/కరీంనగర్ టౌన్: నగరంలోని డంపింగ్ యార్డు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని డీసీసీ అధికార ప్రతినిధి అనంతుల రమేశ్ డిమాండ్ చేశారు. బిజెపి మేయర్, పాలకవర్గం బాధ్యతలు చేపట్టి 8 నెలలు గడుస్తున్నా సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. చెత్త నుంచి వెలువడుతున్న పొగ, దుర్వాసనతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఢిల్లీలో ఉన్న ఓ ఆర్మీ జవాన్ తన కుటుంబం ఎదుర్కొంటున్న ఇబ్బందులపై వీడియో ద్వారా ఆవేదన వ్యక్తం చేయడం, మహిళలు బతుకమ్మలతో నిరసన తెలపడం సమస్య తీవ్రతకు నిదర్శనమన్నారు. గతంలో ప్రకటించిన రూ.50 కోట్ల కేటాయింపులు, బయోమైనింగ్ పనుల ప్రస్తుత పరిస్థితిపై అధికారులు స్పష్టత ఇవ్వాలని కోరారు. పేరుకుపోయిన చెత్తను శాస్త్రీయ పద్ధతుల్లో తొలగించి కొత్త చెత్త నిర్వహణకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని గడువుతో కూడిన కార్యచరణ ప్రణాళిక ప్రకటించి ప్రజారోగ్యాన్ని కాపాడాలని రమేశ్ డిమాండ్ చేశారు.

# జాతీయ ఆరోగ్య మిషన్ పోస్టుల ప్రొవిజనల్ జాబితా విడుదల

### ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వై. పవిత్ర

ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ : పెద్దపల్లి జిల్లాలో జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్ఎం) కార్యక్రమం కింద వైద్య ఆరోగ్యశాఖలో వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల ప్రొవిజనల్ జాబితాను విడుదల చేసినట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వై. పవిత్ర బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.జాతీయ ఆరోగ్య మిషన్ కార్యక్రమం కింద ల్యాబ్ టెక్నీషియన్ పోస్టులు 08, స్టాఫ్ నర్స్ పోస్టులు 15, ఎంఎల్‌హెచ్‌పీ పోస్టులు 08, ఎస్‌టిఎల్ఎస్ పోస్టులు 02, ఏఎన్ఎం పోస్టులు 03, ఫార్మసిస్ట్ పోస్టు 01, పాథాలజిస్ట్ పోస్టు 01, ఓబీజీ స్పెషలిస్ట్ పోస్టులు 02 భర్తీకి దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల ప్రొవిజనల్ జాబితాను విడుదల చేసినట్లు తెలిపారు.సదరు ప్రొవిజనల్ జాబితాను జిల్లా అధికారిక వెబ్‌సైట్ www.peddapalli.telangana.gov.in లో, అలాగే జిల్లా వైద్య మరియు ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయంలో అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు.ప్రొవిజనల్ జాబితాపై ఏవైనా అభ్యంతరాలు ఉన్న అభ్యర్థులు అక్టోబర్ 15, 16, వరకు రెండు రోజులలో తమ అభ్యంతరాలను సంబంధిత కార్యాలయంలో సమర్పించాలని సూచించారు.

# పని చేస్తున్న వారికి పదవులేవీ...?

ప్రజాపక్షం/ఎల్లారెడ్డిపేట: మండలంలోని బొప్పాపూర్ వ్యవసాయ మార్కెట్ నూతన కమిటీపై కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేతల్లో అసహనం నెలకొన్న సోషల్ మీడియా పోస్టులు వైరల్‌గా మారుతున్నాయి. ఇటీవల మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి తమకే దక్కాలని బొప్పాపూర్ కు చెందిన కాంగ్రెస్ కార్యకర్తలు ప్రెస్‌మీట్ ఏర్పాటు చేసి మాట్లాడారు. తమకు దక్కకపోతే మూకుమ్మడి రాజీనామాలు చేస్తామని ప్రకటించినా ఏ ఒక్క నేత కూడా కనీసం స్పందించడం గానీ, భరోసా ఇవ్వడంగానీ చేయకపోవడంతో లోలోపల రగిలిపోతున్నారు. అలాగే చైర్మన్ పదవి ఏండ్ల నుంచి పని చేస్తున్న తమకు ఇవ్వాలని పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ కు ఇటీవల ఫిర్యాదు చేశారు. అంతేకాకుండా తమకు దక్కకుండా కేవలం ఓ నాయకుడు తన పలుకుబడి కోసం పార్టీకి కాంట్రిబ్యూషన్ లేని నాయకుడికి, పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత చేరిన నాయకులకు అవకాశం కల్పిస్తున్నారని ఆరోపించారు. కాగా బుధవారం రాత్రి నూతన మార్కెట్ కమిటీ చైర్మన్, డైరెక్టర్ల ప్రకటనతో కొందరు కాంగ్రెస్ నేతలు పలు వాట్సాప్ గ్రూపుల్లో పని చేసిన వారికి పదవులేవ్వు అంటూ అసహనాన్ని వ్యక్తం చేస్తూ పోస్టులు చేశారు. ఓ దశలో ప్రెస్‌మీట్ పెట్టేందుకు సిద్ధమవుతున్న సమాచారం తెలుసుకున్న నాయకులు హడావిడిగా పార్టీ మండల నాయకుల్వేవరూ లేకుండానే బాధ్యతలు తీసుకున్నారు. దీనిపై సీనియర్ నేతలు లోలోపల రగిలిపోతున్నారు. కొద్దిరోజుల్లో పార్టీలో ఏం జరుగుతుందోనని సాధారణ కార్యకర్తలు తలలు పట్టుకుంటున్నారు.

## జిల్లా ఉత్తమ మహిళా రైతుగా కట్కం విజయలక్ష్మి



ప్రజాపక్షం/ధర్మపురి : జగిత్యాల జిల్లాలో పొలస ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం నందు అక్టోబర్ 14న నిర్వహించిన కిసాన్ మేళా కార్యక్రమంలో రాష్ట్ర సాంఘిక శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మ ణ్ కుమార్ చేతుల మీదుగా ధర్మపురి మండలానికి చెందిన మహిళా రైతు కట్కం విజయలక్ష్మి జిల్లా ఉత్తమ మహిళా రైతు అవార్డును అందుకున్నారు. మహిళా కిసాన్ దివస్–2026 సందర్భంగా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో బెస్ట్ మహిళా రైతు విభాగంలో ఆమెకు ఈ అవార్డును ప్రదానం చేశారు. ధర్మపురి మండలం, నర్సయ్యపల్లె గ్రామ పరిధిలో ని సొంతపల్లె కు చెందిన విజయలక్ష్మి తన వ్యవసాయ క్షేత్రంలో వివిధ రకాల కూరగాయలను సాగు చేయడంతో పాటు వరి పంటను కూడా పండిస్తున్నారు.వ్యవసాయ అధికారి రాజ్ కుమార్,వ్యవసాయ విస్తరణ అధికారి నవ్య లు అందిస్తున్న సూచనలు,సలహాలతో తాను వివిధ సాగు పద్ధతులను పాటిస్తున్నట్లు విజయలక్ష్మి తెలిపారు.ఈ కార్యక్రమంలో జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్,జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్,జిల్లా వ్యవసాయ శాఖ అధికారి భాస్కర్,ధర్మపురి వ్యవసాయ సహాయ సంచాలకులు రాంచందర్,అనుబంధ శాఖ అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

## మహా చండి దేవిగా అమ్మవారి దర్శనం



ప్రజాపక్షం/గొల్లపల్లి : జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలం లోని భీమ్‌రాజ్ పల్లి గ్రామంలో శరన్నవ రాత్రి ఉత్సవాలు ఆధ్యాత్మిక శోభతో అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయి. శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయ ప్రాంగణంలో 'శ్రీ దుర్గా భవాని సేవా సమితి' ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ వేడుకల్లో భాగంగా బుధవారం ఆలయ పరిసరాలు భక్తిపారవశ్యంతో పులకించాయి. నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా అమ్మవారు బుధవారం మహా చండి దేవి అలంకరణలో భక్తులకు దివ్య దర్శనమిచ్చారు. ఆలయ ప్రధానార్చకులు బ్రహ్మశ్రీ తిప్పర్తి సత్యాచార్యుల పర్యవేక్షణలో ఉదయం నుంచే విశేష పూజలు, హోమాలు, మహా చండి మంత్ర హవన క్రతువులు శాస్త్రోక్తంగా సాగాయి. తీరొక్క ఆకుకూరలు, కూరగాయలతో అలంకరించిన శాకాంబరి ప్రసాదాలతో శ్రీ దుర్గా భవాని సేవా సమితి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.అమ్మవారి దివ్య మంగళ రూపాన్ని దర్శించుకునేందుకు భక్తులు బారులుతీరారు.ఈ వేడుకల్లో సేవా సమితి వ్యవస్థాపకులు, ఆలయ చైర్మన్ బొమ్మన కుమార్, గ్రామ సర్పంచ్ కొలగాని శ్రీలత గంగాచారి, ఉప సర్పంచ్ బొమ్మన రాజమ్మ తదితరులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.ఆలయ పాలకవర్గ సభ్యులతో పాటు పెద్ద సంఖ్యలో భవానీ దీక్షాధారులు,భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

## శాకంబరీ దేవిగా వాసవి అమ్మవారి దర్శనం



ప్రజాపక్షం/మెట్‌పల్లి : మెట్‌పల్లి పట్టణంలోని వాసవి దేవాలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా బుధవారం అమ్మవారు శాకంబరీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.ఈ కార్యక్రమంలో పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు మైలారపు రాంబాబు–సంతోషిని, పాంపట్టి అమర్నాథ్–సంధ్యారాణి, వెలగందుల జలంధర్–జ్ఞానేశ్వరి, ఆకొటి లక్ష్మీ కాంతం–రమ్యశ్రీ దంపతులతో పాటు వాసవి గార్డెన్స్ అధ్యక్షుడు కోట కిరణ్‌కుమార్,ఆర్యవైశ్య సంఘం ప్రధాన కార్యదర్శి ఎల్మీ రవికుమార్, కోశాధికారి లక్ష్మీ నారాయణ, చిటిమెల్లి శ్రీనివాస్,పిప్పరి చక్రధర్,నరేంద్రుల రవికుమార్, ఆర్యవైశ్య మహిళలు,ప్రముఖులు,భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.